VELTHURU TELUGU DAILY
# వెలుతురు
## తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
శుక్రవారం 01.05.2026
సంపుటి: 07 సంచిక: 326
పేజీలు: 12 వెల: రూ. 5/
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH
Velthuru Newspaper



**అంతర్జాతీయ కార్మిక దినోత్సవ సందర్భంగా శ్రమజీవులదరికి శుభాకాంక్షలు**
2
టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

**ఉద్యోగాలు, పట్టణాభివృద్ధి, పరిపాలన సంస్కరణలపై ఫోకస్**

- 20కు పైగా అజెండా అంశాలకు ఆమోదం దిశగా చర్చలు
- మున్సిపల్ ఆస్తుల లీజ్ రెన్యువల్, అద్దె విధానాల్లో మార్పులకు గ్రీన్ సిగ్నల్
- పట్టణ స్థానిక సంస్థల్లో మ్యుటేషన్ ఛార్జీలకు ఏకరీతి అమలు ప్రతిపాదన
- ఎస్పీఎఫ్ 2000 బ్యాచ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులపై కీలక నిర్ణయం
- హైకోర్టు, జిల్లా కోర్టుల్లో కొత్త పోస్టుల సృష్టికి ఆమోదం
- ఏపీ భవన్‌లో ఆఫీస్ మేనేజర్ పోస్టు అప్‌గ్రేడ్‌కు గ్రీన్ సిగ్నల్
- ఏపీ ఐఆర్‌డీ, ఈటీసీ శిక్షణ కేంద్రాల్లో అదనపు పోస్టుల ఏర్పాటుకు నిర్ణయం
- ఔట్‌సోర్సింగ్ ద్వారా సబార్డినేట్ పోస్టుల భర్తీకి అనుమతి
- పరిపాలన, సేవల మెరుగుదల లక్ష్యంగా విస్తృత నిర్ణయాలు

అమరావతి వెలుతురు ఏప్రిల్ 30:
రాష్ట్రంలో పరిపాలన, పట్టణాభివృద్ధి, ఉద్యోగావకాశాల విస్తరణ వంటి కీలక అంశాలపై సమగ్ర నిర్ణయాలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో దాదాపు 20కుపైగా అజెండా అంశాలపై చర్చించి ఆమోదం తెలపనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. రాష్ట్ర అభివృద్ధి దిశగా పరిపాలనాత్మక సంస్కరణలకు ఈ సమావేశం కీలక వేదికగా మారింది. పట్టణాభివృద్ధి రంగంలో భాగంగా మున్సిపాలిటీలకు చెందిన ఆస్తుల వినియోగంపై కీలక మార్పులు తీసుకురానున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న లీజ్ రెన్యువల్ ..మిగతా 2లో



## దేశానికే ఆదర్శంగా తెలంగాణలో
# అక్రిడిటేషన్ల జారీ

**అక్రిడిటేషన్ల సంఖ్య తేలితే జర్నలిస్ట్‌లకు మరిన్ని సౌకర్యాల కల్పన**

- గతం కంటే ఇప్పుడు రెట్టింపు సంఖ్యలో అక్రిడిటేషన్ల మంజూరు
- మే10లోగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ అక్రిడిటేషన్లు
- మే1 అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ల పంపిణీకి కలెక్టర్లకు ఆదేశం
- మే 15వరకు అందరికీ బస్సు పాస్‌ల పొడిగింపు
- రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

11





## కార్మికుల శ్రమతోనే
# తెలంగాణ అభివృద్ధి

**కార్మిక లోకానికి సీఎం రేవంత్ మే డే శుభాకాంక్షలు**

**అసంఘటిత రంగ గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా**

**కార్మిక సంక్షేమమే ధ్యేయంగా నూతన పారిశ్రామిక విధానం**

### అసంఘటిత రంగ గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా

- సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బోనస్ పంపిణీ
- చారిత్రాత్మక నిర్ణయం: కాంట్రాక్ట్ కార్మికులకూ రూ. 5000 బోనస్
- బ్యాంకుల సహకారంతో సింగరేణి ఉద్యోగులకు రూ. 1 కోటి బీమా
- గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక రక్షణ, రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల భర్తీ పూర్తి



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కార్మిక వర్గానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కార్మికులు నిజమైన భాగస్వాములని, వారి శ్రమ వల్లే రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని ఆయన కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మిక పక్షపాతేనని, వారి ఆత్మగౌరవాన్ని, హక్కులను కాపాడటంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. మే డే స్ఫూర్తితో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు.

**కార్మికులకు అగ్రపీఠం వేస్తున్న ప్రజా ప్రభుత్వం**

తమ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. మే డే స్ఫూర్తిని నిరంతరం కొనసాగిస్తూ, రాష్ట్రంలోని శ్రమ జీవుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ..మిగతా 2లో



2

### జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం

- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



### త్వరలో సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ప్రారంభం

- రూ.7,823 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్న మోదీ
- మే 10న హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన
- రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు
- పెట్రోలియం టెర్మినల్‌ను ప్రధాని ప్రారంభించనున్నారు

2



## బెంగాల్ గడ్డపై
# విజయం మాదే

- రాష్ట్ర వ్యాప్తంగా 226 సీట్లు గ్యారెంటీ
- ఎగ్జిట్ పోల్స్ అన్నీ కుట్రలే
- ఫలితాలపై మమతా బెనర్జీ ధీమా
- స్ట్రాంగ్ రూమ్‌లపై డేగ కన్ను
- టీఎంసీ కార్యకర్తలకు హై అలర్ట్
- కేంద్ర బలగాలపై సంచలన ఆరోపణలు
- ఓటింగ్ శాతంపై ఓటర్లకు అభినందనలు
- ఎగ్జిట్ పోల్స్ ఒక పెద్ద మోసమని వ్యాఖ్యలు

2

## ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి పనులపై
# మంత్రుల కీలక సమీక్ష

**పాల్గొన్న ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:
హైదరాబాద్‌లోని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి కార్యక్రమాల పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావులతో పాటు ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయడం, భూభారతి అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులకు సమర్థవంతంగా చేరవేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు అధికారులకు దిశానిర్దేశం చేశారు.




### కర్ణాటకలో ప్రస్తుతానికి సీఎం మార్పు లేదు

2



## కౌంటింగ్ కేంద్రాల వద్ద
# మూడంచెల భద్రత

- ఎన్నికల కమిషన్ సంచలన నిర్ణయం
- మూడు అంచెల భద్రతలో ఓట్ల లెక్కింపు
- అనధికార వ్యక్తులకు నో ఎంట్రీ
- క్యూఆర్ కోడ్ స్కానింగ్ తప్పనిసరి
- ఆర్.ఓ జారీ చేసిన ఫోటో ఐడీల మాన్యువల్ తనిఖీ
- కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది అందరికీ నిబంధనలు
- మీడియా కోసం ప్రత్యేక కేంద్రాలు
- యథాతథంగా కవరేజీ అనుమతులు
- విధుల్లో నిర్లక్ష్యం.. ఐదుగురు పోలీసులపై వేటు
- మే 4న ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

11



## మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..
# 12 మంది కూలీల దుర్మరణం

- 35 మంది కూలీలతో బోల్తా పడిన వ్యాన్
- చిక్లియా క్రాసింగ్ వద్ద ఘోర ఢీకొట్టుకున్న వాహనాలు
- ఘటనా స్థలంలోనే 12 మంది మృతి
- 20 మంది తీవ్ర గాయాలు - ఆస్పత్రికి తరలింపు

11




## డీజీపీ శివధర్‌రెడ్డి
# పదవీ విరమణ

- రాష్ట్ర భద్రతా సలహాదారుగా కొత్త బాధ్యతలు
- మూడు దశాబ్దాల పోలీస్ ప్రస్థానానికి ముగింపు
- ప్రజల ముంగిటకే పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై సంతృప్తి
- శివధర్ పై సీవీ ఆనంద్ ప్రశంసల జల్లు
- నక్సలిజం అణచివేతలో శివధర్ పాత్ర అమోఘం




2

## అంతర్జాతీయ కార్మిక దినోత్సవ సందర్భంగా శ్రమజీవులదరికి శుభాకాంక్షలు

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు రాష్ట్రంలోని కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే పునాది అని పేర్కొన్నారు. పరిశ్రమలు, వ్యవసాయం, నిర్మాణ రంగం సహా ప్రతి రంగంలో కార్మికుల కృషి అపారమని కొనియాడారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి జీవనోపాధి మెరుగుదల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఆరోగ్య సదుపాయాలు వంటి అంశాల్లో సమగ్ర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. కార్మికుల శ్రేయస్సే రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభమని ఆయన అన్నారు. ఈ మే డే సందర్భంగా ప్రతి కార్మికుడి కష్టం, త్యాగం స్మరించుకుంటూ, వారి హక్కుల సాధనకు కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## బెంగాల్ గడ్డపై విజయం మాదే

పశ్చిమ బంగాల్ వెలుతురు ఏప్రిల్ 30:

పశ్చిమ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలను ఆమె పూర్తిగా కొట్టిపారేశారు. ఈ అంచనాలన్నీ బీజేపీ కార్యాలయం నుంచి వెలువడిన స్క్రిప్ట్ అని, షేర్ మార్కెట్‌ను ప్రభావితం చేసేందుకు మరియు టీఎంసీ శ్రేణులను నిరుత్సాహపరిచేందుకు పన్నిన కుట్ర అని మండిపడ్డారు. బంగాల్ ప్రజలు నిశ్శబ్దాత్మకమైన తీర్పు ఇచ్చారని, మే 4న ఫలితాలు వెలువడ్డాక బీజేపీకి గట్టి సమాధానం లభిస్తుందని ఆమె స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియో సందేశంలో దీదీ తనదైన శైలిలో ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు.

**విజయం మాదే.. 230 దాటినా ఆశ్చర్యం లేదు**

ఎగ్జిట్ పోల్స్ అంచనాలు బీజేపీకి అనుకూలంగా ఉండటాన్ని మమతా బెనర్జీ తీవ్రంగా పరిగణించారు. "నాకు నా ప్రజలపై, పార్టీ కార్యకర్తలపై పూర్తి నమ్మకం ఉంది. బంగాల్‌లో టీఎంసీ 226 నుంచి 230 కి పైగా స్థానాలను గెలుచుకోబోతోంది. మూడింట రెండు వంతుల మెజారిటీతో మేం మళ్ళీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం" అని ఆమె ప్రకటించారు. బీజేపీ ఎన్ని కుతంత్రాలు చేసినా, బంగాల్ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంలో ఓటర్లు వెనకడుగు వేయలేదని ఆమె కొనియాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పు అద్భుతంగా ఉండబోతోందని దీదీ ధీమా వ్యక్తం చేశారు.

**ఎగ్జిట్ పోల్స్ వెనుక పెద్ద కుట్ర!**

టీవీ ఛానళ్లలో వస్తున్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల వెనుక బీజేపీ హస్తం ఉందని మమత ఆరోపించారు. బుధవారం మధ్యాహ్నం 1.08 గంటలకే బీజేపీ కార్యాలయం నుంచి పంపిన సమాచారాన్నే సాయంత్రం సర్వేల పేరుతో ప్రసారం చేశారని ఆమె విమర్శించారు. దీనికోసం టీవీ ఛానళ్లకు భారీగా డబ్బులు ముట్టాయని, ఇది కేవలం స్టాక్ మార్కెట్ ఆపరేటర్లకు మేలు చేసేందుకు మరియు తమ పార్టీ కేడర్‌ను భయపెట్టేందుకు చేసిన ప్రయత్నమని అన్నారు. గతంలోనూ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చాలాసార్లు తప్పని నిరూపితమయ్యాయని ఆమె గుర్తు చేశారు.

**ఈవీఎంల భద్రతపై కఠిన ఆదేశాలు**

ఓట్ల లెక్కింపు వరకు టీఎంసీ అభ్యర్థులు, కార్యకర్తలు విశ్రమించకూడదని మమత ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రాత్రిపగలు నిఘా ఉంచాలని, షిఫ్టుల వారీగా పర్యవేక్షించాలని సూచించారు. ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాలకు తరలించే సమయంలో ట్యాంపరింగ్ జరిగే అవకాశం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అప్రమత్తత వీడరాదని హెచ్చరించారు. "లెక్కింపు కేంద్రాల్లో అభ్యర్థులు స్వయంగా ఉండాలి, చిన్న బ్రేక్ కోసం కూడా బయటకు రావద్దు" అని ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తాను కూడా వ్యక్తిగతంగా భద్రతా అంశాలను పర్యవేక్షిస్తున్నానని తెలిపారు.

**కేంద్ర బలగాల తీరుపై నిప్పులు**

ఎన్నికల నిర్వహణలో కేంద్ర భద్రతా బలగాలు బీజేపీ ఏజెంట్లుగా పనిచేశాయని మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. చాలాచోట్ల మహిళలు, పిల్లలు, జర్నలిస్టులపై బలగాలు దాడులకు పాల్పడ్డాయని ఆరోపించారు. టీఎంసీ పోలింగ్ ఏజెంట్లను అక్రమంగా అరెస్టు చేయించారని, భాత్ పారా, భవానీపుర్ వంటి ప్రాంతాల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారని మండిపడ్డారు. అయినప్పటికీ, తమ కార్యకర్తలు ధైర్యంగా నిలబడి పోరాడారని, ఈ పోరాటమే తమను గెలిపిస్తుందని అన్నారు. ఉదయ్ నారాయణ్‌పుర్‌లో ఓ సీనియర్ సిటిజెన్ మరణించడం పట్ల ఆమె సంతాపం వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ మద్దతు - జైరాం రమేశ్ విమర్శలు**

మమతా బెనర్జీ వ్యాఖ్యలకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ మద్దతు పలికారు. ఎగ్జిట్ పోల్స్ అనేవి ఒక పెద్ద మోసమని, వాటికి శాస్త్రీయత లేదని ఆయన కొట్టిపారేశారు. 2021లో కూడా ఎగ్జిట్ పోల్స్ అన్నీ తప్పని తేలాయని గుర్తు చేశారు. ఇదే క్రమంలో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) తీరుపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తటస్థంగా వ్యవహరించడం లేదని, లక్షలాది మంది ఓటర్ల పేర్లను తొలగించారని ఆరోపించారు. సీఈసీని తొలగించే వరకు తమ పార్లమెంటరీ పోరాటం కొనసాగుతుందని జైరాం రమేశ్ స్పష్టం చేశారు.చివరగా, "మే 4వ తేదీ సాయంత్రం వరకు ఆగండి.. నిజమైన ఫలితాలు ఏమిటో ప్రపంచానికి తెలుస్తుంది" అని మమతా బెనర్జీ సవాల్ విసిరారు. బంగాల్ ప్రజలు ఇచ్చే 'దిద్దుబాటు తీర్పు' దేశ రాజకీయాలను మలుపు తిప్పుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## కర్ణాటకలో ప్రస్తుతానికి సీఎం మార్పు లేదు

బెంగళూరు వెలుతురు ఏప్రిల్ 30:

కర్ణాటక రాజకీయాల్లో గత కొంత కాలంగా కొనసాగుతున్న సీఎం మార్పు ఊహాగానాలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెరదించారు. కర్ణాటకలో ప్రస్తుతానికి ముఖ్యమంత్రి మార్పు ఏదీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నాయకత్వ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఆయన గురువారం స్పష్టం చేశారు. "ప్రస్తుతానికి సీఎం మార్పు అనే ప్రశ్నే లేదు. ఇప్పటికే ఒక ముఖ్యమంత్రి ఉన్నారు. ఒక వేళ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, నేను కలిసి మార్పు దిశగా ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, దానికి కొంత సమయం పడుతుంది. అప్పటి వరకు వేచి చూడాలి."

**- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు**

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతోపాటు, కర్ణాటకలోని రెండు అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికల ఫలితాలు మే4న వెలువడనున్నాయి. ఈ ఫలితాల అనంతరం కర్ణాటకలో సీఎం మార్పు, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కాంగ్రెస్ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకుంటుందనే ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఖర్గే తాజా వ్యాఖ్యలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత నేటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య ఓ ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం శివకుమార్‌కు సీఎం పదవి ఇవ్వాలని ఆయన మద్దతుదారులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

**సోనియా గాంధీ ఆజ్ఞ ఉంటేనే!**

అనుభవజ్ఞుడైన ఖర్గే కర్ణాటక ముఖ్యమంత్రి అయితే పార్టీలోని అందరూ స్వాగతిస్తారని కర్ణాకట హోంమంత్రి పరమేశ్వర బుధవారం వ్యాఖ్యానించారు. దీనిపై ఖర్గే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నేను ముఖ్యమంత్రి అయితే బాగుంటుందని మీరు (మీడియా), ఆయన (పరమేశ్వర), ప్రజలు అనుకోవచ్చు. కానీ నా తలరాత కంటే కూడా, నా సిద్ధాంతాలు, పార్టీకి నేను చేసిన సేవను బట్టి నా విషయంలో సోనియా గాంధీ నిర్ణయం తీసుకుంటారు" అని ఆయన తేల్చిచెప్పారు. 2025 నవంబర్ 20 నాటికి కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి రెండున్నర ఏళ్లు పూర్తి అయ్యింది. ఈ నేపథ్యంలోనే నాయకత్వ మార్పులు చర్చలు, ఊహాగానాలు ముదిరాయి. ఇదిలా ఉండగా, వచ్చే నెలలో దాదాపు 40 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దిల్లీ టికెట్లు బుక్ చేసుకున్నారని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఖర్గే స్పందిస్తూ, 'నాకు ఆ విషయం తెలియదు. ఆ వివరాలు ఏమిటో ఆయననే అడగండి' అని పేర్కొన్నారు.

**కేరళ, తమిళనాడులో విజయం ఖాయం!**

బుధవారం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై కూడా ఖర్గే స్పందించారు. తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని కూటమి తిరిగి అధికారం దక్కించుకుంటుందని అన్నారు.

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)

విధానాన్ని సవరించి, అద్దె నిర్ణయ ప్రక్రియను పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలపనుందని సమాచారం. దీని ద్వారా స్థానిక సంస్థల ఆదాయ వనరులు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. అలాగే రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యుటేషన్ ఛార్జీల అమలులో ఏకరీతి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం విభిన్న ప్రాంతాల్లో వేర్వేరు విధానాలు అమల్లో ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకే విధమైన చట్టపరమైన మార్పులు చేసి, రాష్ట్రవ్యాప్తంగా సమాన విధానం అమలు చేసే ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించే అవకాశముంది. పోలీసు విభాగంలో పదోన్నతులకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) 2000 బ్యాచ్‌కు చెందిన 385 మంది కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోట్ చేసే ప్రతిపాదనను ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా సిబ్బంది ఉత్సాహం పెరుగుతుందని, విభాగ పనితీరు మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. న్యాయవ్యవస్థలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు కూడా కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. హైకోర్టు, జిల్లా న్యాయస్థానాల్లో చీఫ్ కోర్టు మేనేజర్, సీనియర్ కోర్టు మేనేజర్లు, కోర్టు మేనేజర్లతో కలిపి మొత్తం 21 కొత్త పోస్టులను సృష్టించేందుకు కేబినెట్ అంగీకారం తెలపనుంది. ఈ నిర్ణయం ద్వారా న్యాయస్థానాల పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని భావిస్తున్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ కార్యాలయంలో ఉన్న ఆఫీస్ మేనేజర్ పోస్టును సెక్షన్ ఆఫీసర్‌గా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఈ మార్పు ద్వారా పరిపాలనా వ్యవస్థ బలోపేతం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి రంగంలో శిక్షణా వసతులను మెరుగుపరచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఏపీ ఐఆర్‌డీ), ఈటీసీ శిక్షణ కేంద్రాల్లో కలిపి 20 కొత్త పోస్టులను సృష్టించేందుకు ప్రతిపాదన సిద్ధమైంది. దీనికి కేబినెట్ ఆమోదం లభించే అవకాశముంది. దీని ద్వారా శిక్షణా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుంది. అదనంగా పరిపాలనా అవసరాల దృష్ట్యా మరో 9 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు సమాచారం. మొత్తంగా ఈ కేబినెట్ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర పరిపాలనను మరింత సమర్థవంతంగా మార్చడమే లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఉద్యోగావకాశాల విస్తరణ, పట్టణాభివృద్ధి, న్యాయవ్యవస్థ బలోపేతం, పోలీసు విభాగంలో పదోన్నతులు వంటి అంశాలు ప్రభుత్వ ప్రాధాన్యతను ప్రతిబింబిస్తున్నాయి. ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే ప్రభుత్వ సేవల అందుబాటు మెరుగుపడటంతో పాటు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనాలు చేకూరే అవకాశముందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి దిశగా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు ఈ కేబినెట్ సమావేశం మరోసారి స్పష్టం చేసింది.

## డీజీపీ శివధర్‌రెడ్డి పదవీ విరమణ

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:

తెలంగాణ రాష్ట్ర పోలీస్ బాస్ (డీజీపీ) డా. శివధర్‌రెడ్డి గురువారం పదవీ విరమణ చేశారు. 32 ఏళ్ల పాటు పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పని చేసిన ఆయనకు హైదరాబాద్ పోలీస్ అకాడమీ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు ఉన్నతాధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం శివధర్‌రెడ్డి భావోద్వేగంతో ప్రసంగించారు. తన సుదీర్ఘ ప్రయాణంలో వెన్నుతట్టి నడిపించిన సీనియర్లకు, సహకరించిన తోటి అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పోలీసింగ్‌లో వచ్చిన మార్పులను స్వాగతిస్తూనే, ప్రజలకు చేరువయ్యేలా పనిచేయాలని యువ అధికారులకు పిలుపునిచ్చారు. అనంతరం, ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి 'రాష్ట్ర భద్రతా సలహాదారు' గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాతో ఆయన మూడేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు.

**పోలీసింగ్‌లో మార్పులు - అనుభవాల నిధి**

పదవీ విరమణ సభలో శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. 32 ఏళ్ల సర్వీసులో ఎన్నో జ్ఞాపకాలు, ఒత్తిడిలు, తీపి గుర్తులు మిగిలాయని అన్నారు. తన కెరీర్ ప్రారంభంలో ఉన్న పోలీసింగ్ పద్ధతులకు, ఇప్పటి పరిస్థితులకు చాలా వ్యత్యాసం వచ్చిందని పేర్కొన్నారు. సాంకేతికత పెరగడం వల్ల నేరాల నియంత్రణ సులభమైనప్పటికీ, సవాళ్లు కూడా అంతే స్థాయిలో పెరిగాయని అభిప్రాయపడ్డారు. ప్రజలకు, పోలీసులకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేసిన 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానం మంచి ఫలితాలను ఇచ్చిందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. డీజీపీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**నక్సలిజం అణచివేతలో వీరగాథ**

నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్, శివధర్‌రెడ్డి సేవలను కొనియాడారు. ముఖ్యంగా నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో శివధర్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. మావోయిస్టుల లొంగుబాటులో, భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో ఆయన వ్యూహాలు అద్భుతంగా పనిచేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయడంలో శివధర్ రెడ్డి కృషి మరువలేనిదని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. 2016 నుంచి ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, భవిష్యత్తులోనూ ఆయన సూచనలు తీసుకుంటామని చెప్పారు.

**రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియామకం**

శివధర్‌రెడ్డి విశిష్ట సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, ఆయన పదవీ విరమణ చేసిన వెంటనే కీలక పదవిని కట్టబెట్టింది. రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమిస్తూ సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో ఉండే శివధర్‌రెడ్డి, రాష్ట్ర భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రతా అంశాల్లో ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనున్నారు. కేబినెట్ ర్యాంకుతో సమానమైన సీఎస్ హోదాలో ఆయన విధులు నిర్వర్తిస్తారు.

**ప్రస్థానం: పల్లెటూరు నుంచి పోలీస్ బాస్ వరకు**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామానికి చెందిన శివధర్‌రెడ్డి సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చారు. 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏఎస్పీగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంటెలిజెన్స్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆయనది అందెవేసిన చేయి. అదనపు డీజీపీగా, రోడ్డు భద్రతా విభాగంలోనూ ఆయన విశేష సంస్కరణలు తెచ్చారు. గతేడాది అక్టోబర్‌లో పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు చేపట్టి, శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు. చివరగా, తన వారసుడిగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్‌కు శివధర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖ గౌరవాన్ని కాపాడటం ప్రతి అధికారి బాధ్యతని, యువ అధికారులు ప్రజా సేవలో అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం

- **విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి**
- **వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు**
- **ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి**
- **సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30: విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, TGBCWRIES కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల శ్రమతోనే తెలంగాణ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

లక్షలాది మందికి భరోసా కల్పిస్తూ, దేశంలోనే తొలిసారిగా 'తెలంగాణ గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ వెల్ఫేర్ యాక్ట్'ను తీసుకువచ్చామని గుర్తు చేశారు. దీని ద్వారా గిగ్ వర్కర్లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

**పారిశ్రామికాభివృద్ధి ద్వారా ఉపాధి కల్పన**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం కార్మిక వర్గం యొక్క సాధికారతకు మరియు జీవన ప్రమాణాల మెరుగుదలకు ఎంతో దోహదపడుతుందని సీఎం తెలిపారు. ఈ విధానం వల్ల రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తరలివస్తున్నాయని, తద్వారా లక్షలాది మంది యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. కేవలం ఉపాధి కల్పన మాత్రమే కాకుండా, కార్మికులకు గౌరవప్రదమైన వేతనాలు మరియు సురక్షితమైన పని వాతావరణం ఉండేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తోందని చెప్పారు.

**సింగరేణి కార్మికులకు ప్రత్యేక గుర్తింపు**

రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని, ఇది దేశానికే గర్వకారణమని రేవంత్ రెడ్డి కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సింగరేణి కార్మికులకు పండుగ బోనస్‌లను ముందుగానే విడుదల చేస్తున్నామని తెలిపారు. సింగరేణి చరిత్రలోనే తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులను గుర్తించి, ఒక్కొక్కరికి రూ. 5000 చొప్పున బోనస్ అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గర్వంగా ప్రకటించారు. అంతేకాకుండా, బ్యాంకుల సహకారంతో సింగరేణి కార్మికులకు రూ. 1 కోటి వరకు బీమా రక్షణ కల్పిస్తున్నామని వెల్లడించారు.

**గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై శ్రద్ధ**

ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడే ప్రాణాలు కోల్పోయిన తెలంగాణ కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి తెలిపారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. విదేశాల్లో పనిచేస్తున్న రాష్ట్ర కార్మికుల రక్షణ కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఆయన వివరించారు.

**కారుణ్య నియామకాలు, ఇతర ప్రయోజనాలు**

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను తమ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేసిందని రేవంత్ రెడ్డి తెలిపారు. దీనివల్ల వందలాది కుటుంబాల్లో వెలుగులు నిండాయని అన్నారు. కార్మికులు దేశ పురోగతికి మూలస్తంభాలని, వారి సహకారం లేకుండా ఏ రాష్ట్రం లేదా దేశం అభివృద్ధి చెందలేదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపడానికి కార్మిక లోకం అందిస్తున్న సహకారానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. శ్రమయేవ జయతే అన్న నినాదంతో, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. మే డే వేడుకలను కార్మికులందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## త్వరలో సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ప్రారంభం

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:

సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రకటించారు. మే 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా రాష్ట్రంలో రూ.7,823 కోట్ల విలువైన అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాలను వెల్లడించారు. హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తుల టెర్మినల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట మరియు జోగులాంబ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసి ప్రారంభిస్తారు. కాజీపేట నుంచి విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారంభించనున్నారు.

**రైల్వే, టెక్స్‌టైల్ రంగాల్లో భారీ ప్రాజెక్టులు**

రాష్ట్రంలో ప్రస్తుతం రూ.85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట మధ్య ఎంఎంటీఎస్ (MMTS) పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. అలాగే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నామని, 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర మంత్రి వెల్లడించారు.

**సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ**

ఆదివాసీ యువతకు ఉన్నత విద్యావకాశాలు కల్పించడం లక్ష్యంగా సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని కిషన్ రెడ్డి ప్రకటించారు. ఈ యూనివర్సిటీ ఆదివాసీ సమాజానికి చారిత్రక ప్రాముఖ్యత కలిగిన సమ్మక్కసారలమ్మ జాతర స్థలం సమీపంలో ఏర్పాటు చేయడం ద్వారా గిరిజనుల అభివృద్ధికి కొత్త ఊపిరి వస్తుందని ఆయన అన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, రవాణా, ఉపాధి, విద్య మరియు పారిశ్రామిక అభివృద్ధికి బలమైన పునాది వేస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# దత్తత తీసుకొనేటప్పుడు నిబంధనలు పాటించాలి

- దత్తత ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు తప్పనిసరి : మంత్రి సీతక్క
- దత్తత కోరేవారు ఐసీడీఎస్‌ను సంప్రదించాలని స్పష్టం
- కాచిగూడ బస్ టెర్మినల్‌లో అమ్మఒడి తల్లిపాల ఫీడింగ్ కేంద్రం ప్రారంభం
- రైల్వే స్టేషన్‌లో పిల్లల దత్తత సహాయ కేంద్రానికి శ్రీకారం
- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి
- పబ్లిక్ ప్రదేశాల్లో తల్లులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని వెల్లడింపు
- సమ్మక్క–సారలమ్మ జాతరలో తల్లులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- జనసమ్మర్థ ప్రాంతాల్లో ఫీడింగ్ సెంటర్ల ఏర్పాటు పై దృష్టి
- పిల్లల సంక్షేమానికి సమగ్ర చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం
- అధికారులతో కలిసి సేవల విస్తరణపై మంత్రి సమీక్ష



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:

పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర శిశు, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచించారు. చట్టబద్ధమైన విధానాల ప్రకారం మాత్రమే దత్తత ప్రక్రియ జరగాలని, ఎలాంటి అనధికార మార్గాలను ఆశ్రయించరాదని స్పష్టం చేశారు. దత్తత కోరేవారు తప్పనిసరిగా ఐసీడీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) అధికారులను సంప్రదించి ముందుకు సాగాలని మంత్రి పేర్కొన్నారు.

శుక్రవారం హైదరాబాద్ నగరంలోని కాచిగూడ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాచిగూడ బస్ టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన 'అమ్మఒడి' తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే కాచిగూడ రైల్వే స్టేషన్‌లో పిల్లల దత్తత సహాయ కేంద్రానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పబ్లిక్ ప్రదేశాల్లో తల్లులు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ముఖ్యంగా బస్సు టెర్మినల్‌లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి జనసమ్మర్థ ప్రాంతాల్లో తల్లిపాల ఫీడింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా తల్లులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

పిల్లల దత్తత ప్రక్రియను పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించడం చాలా ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. దత్తత పేరుతో జరిగే అక్రమాల పై అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల ద్వారా మాత్రమే దత్తత ప్రక్రియ కొనసాగించాలని పేర్కొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతర వంటి భారీ జనసమ్మర్థ కార్యక్రమాల్లో తల్లులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. అక్కడ కూడా తల్లిపాల ఫీడింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, తల్లులకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. పిల్లల సంక్షేమం, మహిళల సౌకర్యం ప్రభుత్వానికి ప్రాధాన్యత అంశాలని మంత్రి పేర్కొన్నారు. ఈ దిశగా రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఫీడింగ్ కేంద్రాలు, దత్తత సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.

కాచిగూడలో ప్రారంభించిన ఈ కేంద్రాల ద్వారా ప్రయాణికులకు, ముఖ్యంగా మహిళలకు, చిన్నపిల్లలతో ప్రయాణించే తల్లులకు పెద్ద ఎత్తున ఉపశమనం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. తల్లులు ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ శిశువులకు పాలు పట్టించేందుకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

దత్తత కేంద్రం ద్వారా దత్తత ప్రక్రియపై అవగాహన పెంపొందించడంతో పాటు, అవసరమైన మార్గదర్శకాలు అందించే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు. దీంతో దత్తతకు సంబంధించిన చట్టపరమైన అవగాహన కూడా పెరుగుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక, శిశు సంక్షేమ శాఖ అధికారులు, రైల్వే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మొత్తంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలు మహిళల, చిన్నపిల్లల సంక్షేమానికి దోహదపడటంతో పాటు, ప్రజా సేవల విస్తరణలో మరో ముందడుగుగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు.

# కొత్త అక్రెడిటేషన్లు వచ్చే వరకు పాత కార్డుల గడువు పొడిగించాలి



- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 30:

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల పాత అక్రెడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తున్నందున కొత్త అక్రెడిటేషన్ కార్డులు జారీ అయ్యేంత వరకు పాత కార్డులు చెల్లుబాటు అయ్యే విధంగా కనీసం నెల రోజులకు పొడిగించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాత అక్రెడిటెషన్ కార్డుల చెల్లుబాటు గడువైతే ముగిసింది కానీ కొత్త కార్డులు మాత్రం ఇంతవరకు జారీ చేయలేదని, ఆరంభ శూరత్వంగా గురువారం హైదరాబాద్ లో
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొద్ది మంది జర్నలిస్టులకు మాత్రమే అందజేశారని, అంతే తప్ప రాష్ట్ర స్థాయిలో గానీ, జిల్లా, మండల స్థాయిలో గానీ ఇంకెవరికీ కార్డులివ్వలేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు కూడా ఇంతవరకు కార్డులివ్వలేదని, ఈ ప్రక్రియలో ఏర్పడిన గందరగోళం కారణంగా చాలా మంది జర్నలిస్టులు నేటికీ దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. కొత్త కార్డులు రాకముందే పాత కార్డుల చెల్లుబాటును నిలిపివేయడం సరైంది కాదని, దీనివల్ల జర్నలిస్టులకు ఇబ్బందులు ఎదురవుతాయని ,ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సౌకర్యం, ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మే ఒకటి నుంచి 10వ తేదీ మధ్య అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలంటూ ఐఅండ్ పీఆర్ కొత్త కమీషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని, అయితే కొత్త కార్డులు వచ్చేంత వరకు పాత కార్డులు చెల్లుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని మామిడి సోమయ్య కోరారు.

# గురు తేజ్ బహదూర్ త్యాగం నిరుపమానమైనది : మంత్రి జూపల్లి కృష్ణారావు





వెలుతురు నందిగామ (రంగారెడ్డి జిల్లా), ఏప్రిల్ 30 :

చరిత్ర, ఆధ్యాత్మికత, జాతీయ వారసత్వాల అరుదైన కలయికకు కన్హా శాంతి వనం వేదికైంది. గురు తేజ్ బహదూర్ 350వ అమర వీరుల సంవత్సరం, బాబూజీ మహారాజ్ 127వ జయంతి, రాష్ట్ర సంత్ తుక్డోజీ మహారాజ్ 117వ జయంతిని పురస్కరించుకుని గురువారం ఇక్కడ భారీ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు.

ఈ వేడుకలో భారత మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, హార్ట్‌ఫుల్‌నెస్ గైడ్ 'దాజీ' పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి 160 దేశాల నుండి వచ్చిన వేలాది మంది ఆధ్యాత్మిక సాధకులు హాజరయ్యారు.

తొమ్మిదవ సిక్కు గురువు, 'హింద్ దీ చాదర్' (భారత రక్షణ కవచం) గా ప్రసిద్ధి చెందిన ఆయన, మత స్వేచ్ఛ, మానవ హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన అత్యున్నత త్యాగాన్ని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు స్మరించుకుని, ఘన నివాళులర్పించారు. "ప్రపంచ చరిత్రలో గురు తేజ్ బహదూర్ జీ అద్వితీయులని, తన సొంత విశ్వాసం కోసం కాకుండా, ఇతరుల మత స్వేచ్ఛను కాపాడటం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వీరుడని ఆయన సేవలను కొనియాడారు.

హార్ట్‌ఫుల్‌నెస్ వ్యవస్థాపకులు బాబూజీ మహారాజ్ సేవలను గుర్తుచేసుకుంటూ, క్లిష్టమైన యోగా మార్గాన్ని సామాన్యులకు సైతం అందుబాటులోకి తెచ్చారని మంత్రి ప్రశంసించారు. "దేవుడు ఎక్కడో దూరంగా ఉండే వ్యక్తి కాదు, గుండె లోతుల్లో ఉండే ప్రశాంతత అని ఆయన నిరూపించారని, ఆయన చూపిన మార్గం నేడు తెలంగాణను అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చింది" అని పేర్కొన్నారు.

కన్హా శాంతి వనం కేవలం ఒక ఆధ్యాత్మిక కేంద్రమే కాకుండా, పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి అన్నారు. విదేశీ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణలోని రామప్ప దేవాలయం, గోల్కొండ కోట, బుద్ధవనం వంటి చారిత్రక కట్టడాలను సందర్శించాలని కోరారు. ఇవి కేవలం రాతి నిర్మాణాలు కావని, మన పూర్వీకుల సృజనాత్మకత, జ్ఞానానికి చిహ్నాలని ఆయన వివరించారు.


కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక గ్రంథాలను అతిథులు ఆవిష్కరించారు. "ఒకే మానవత్వం ఒకే హృదయం" అనే సందేశం ప్రపంచశాంతికి వారధిగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.

# నూతన వధూవరులకు మున్సిపాలిటీ నాయకుల ఆశీర్వాదం



కేసముద్రం వెలుతురు ఏప్రిల్ 30:

కేసముద్రం మున్సిపాలిటీ సంతోష్ నగర్ కాలనీకి చెందిన సిపిఐఎంల్ నాయకులు శివారపు మమతశ్రీధర్ ల కుమార్తె నందిని వివాహం వరుడు భరత్ తో కేసముద్రం మున్సిపాలిటీలోని హరిహర గార్డెన్ లో జరగగా ఈ వివాహ మహోత్సవ వేడుకకు నాయకులు మర్రి రంగారావు,నీలం దుర్గేష్, గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ గుగులోత్ వీరు నాయక్ లు హాజరై నూతన వధూవరులను వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు వారిపై మెండుగా ఉండాలని వధూవరులకు నూతన పట్టు వస్త్రాలు అందజేసి అక్షంతలు వేసి ఆశీర్వదించారు.



# డిగ్రీల దండగ.. నైపుణ్యాల పండగ




నేడు మనం చదువుల జాతరలో ఉన్నాం, కానీ ఆ చదువులకు అర్థం ఇచ్చే ఉపాధి తీరంలో ఎడారి కనిపిస్తోంది. గణంకాల గండం మన కళ్ళముందు ఒక భయంకరమైన నిజాన్ని ఆవిష్కరిస్తోంది. 2025 తాజా నివేదిక ప్రకారం, దాదాపు 45% మంది పట్టభద్రులు పట్టా చేతబట్టుకుని నిరుద్యోగులుగా వీధుల్లో మిగిలిపోతున్నారు. ఇది కేవలం అంకె కాదు, లక్షలాది కుటుంబాల ఆవేదన.ప్రతి సంవత్సరం 1.5 కోట్ల కొత్త ఆశల కెరటాలు, వెయ్యి కలలతో జాబ్ మార్కెట్‌లోకి దూసుకొస్తున్నాయి. కానీ, తీరం చేరకముందే ఆ కెరటాలు నైపుణ్యం అనే రాతి గోడను ఢీకొంటున్నాయి. ఇక్కడ విచారకరమైన విషయం ఏమిటంటే 65% కంపెనీలు ఒకే మాటను ఘోషిస్తున్నాయి. అభ్యర్థుల దగ్గర భారీ డిగ్రీలు ఉన్నాయి, కానీ ఆఫీసులో పనిచేయడానికి కావాల్సిన కనీస పని కొచ్చే' నైపుణ్యం మాత్రం సున్నా!
మరి ఈ అగాధానికి బాధ్యులు ఎవరు? చదువు చెప్పిన వ్యవస్థా? లేక కాలానుగుణంగా మారని మన విద్యార్థులా? ఈ చేదు నిజం వెనుక ఉన్న అసలు కథేంటో చూడాల్సిందే! భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన యువత రంగం ఉన్న దేశం అని మనం డప్పు కొట్టుకుంటాం. జనాభాలో సగానికి పైగా 35 ఏళ్ల లోపు వారే ఉండటం మనకు లభించిన 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' అని గంభీరమైన ఉపన్యాసాలు ఇస్తుంటాం. కానీ, గ్రౌండ్ రియాలిటీలోకి వెళ్తే ఆ దృశ్యం గుండెల్ని పిండేస్తుంది. ఏటా లక్షలాది మంది విద్యార్థులు నల్లటి గౌన్లు వేసుకుని, పట్టాలు చేతబట్టుకుని యూనివర్సిటీ గేట్ల నుంచి బయటకు వస్తున్నారు. వారి కళ్ళలో వెయ్యి వాట్ల వెలుగు ఉండాలి, కానీ అక్కడ కనిపిస్తున్నది రేపటి గురించిన అభద్రతా భావం. చేతిలో మెరిసే డిగ్రీ ఉంది, వెన్ను తట్టి ప్రోత్సహించే తల్లిదండ్రుల ఆశలు ఉన్నాయి కానీ జేబులో మాత్రం ఒక ఆఫర్ లెటర్ కూడా లేదు. ఈ నిశ్శబ్ద విషాదానికి కారణాలు ఏమిటి? అక్షరాల అమ్ములపొదిలో అస్త్రాలు ఎందుకు పనిచేయడం లేదు? పరిష్కారం ఎక్కడ దాగి ఉంది?మన విద్యా వ్యవస్థ నేటికీ 20వ శతాబ్దపు గుమాస్తా మనస్తత్వం నుంచి బయటపడలేదు. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు సృష్టిస్తుంటే, మన విద్యార్థులు ఇంకా దశాబ్దాల క్రితం రాసిన పాఠ్యపుస్తకాలలోని సిద్ధాంతాలను బట్టీ పడుతున్నారు. బోధనా పద్ధతులు మారలేదు, సబ్జెక్టుల్లో తాజాదనం లేదు. పరిశ్రమకు కావలసిన నైపుణ్యాలకు (Industry Requirements) మరియు కాలేజీలో నేర్చుకుంటున్న పాఠాలకు మధ్య ఒక హిమాలయమంత అగాధం ఏర్పడింది. ఒక ఇంజినీరింగ్ విద్యార్థి నాలుగు ఏళ్ల పాటు భారీ పుస్తకాలు చదివి, సర్టిఫికేట్ పొందినప్పటికీ, ప్రాక్టికల్‌గా ఒక కోడింగ్ సమస్యను పరిష్కరించలేకపోవడం నేటి విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనం.CII (Confederation of Indian Industry) నివేదిక వెల్లడించిన చేదు నిజం ఏమిటంటే భారతీయ పట్టభద్రులలో కేవలం 45 శాతం మంది మాత్రమే నేరుగా ఉద్యోగంలో చేరడానికి అర్హులు. మిగతా 55 శాతం మందికి కనీసం ఆరు నెలల అదనపు శిక్షణ ఇస్తే తప్ప వారు పనికి రారని కంపెనీలు తేల్చి చెప్తున్నాయి. అంటే, మనం కాలేజీల్లో సంపాదిస్తున్నది కేవలం కాగితపు ముక్కలనే తప్ప కార్యాచరణ నైపుణ్యాలను కాదని స్పష్టమవుతోంది. డిగ్రీ ఉన్నా నైపుణ్యం లేకుంటే ఆ కాగితం విలువ ఏమిటి? నేటి యువత మారాలి, విద్యావ్యవస్థ సమూలంగా ప్రక్షాళన కావాలి, లేదా మన భవిష్యత్తు చీకటిమయం కావడం ఖాయం. మనం 'ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్' (4IR) యుగంలో ఉన్నాం. కృత్రిమ మేధ (AI), ఆటోమేషన్, రోబోటిక్స్ వంటి సాంకేతికతలు ప్రపంచ గమనాన్ని మారుస్తున్నాయి. ఒకప్పుడు వంద మంది చేయాల్సిన పనిని నేడు ఒక సాఫ్ట్‌వేర్ చిటికెలో చేసేస్తోంది. బ్యాంకుల్లో క్లర్కుల పోస్టులు మాయమవుతున్నాయి, ఫ్యాక్టరీల్లో మనుషుల స్థానంలో రోబో చేతులు కనిపిస్తున్నాయి. డేటా ఎంట్రీ, కస్టమర్ కేర్, మాన్యుఫ్యాక్చరింగ్ వంటి సంప్రదాయ రంగాల్లో ఉద్యోగాల కోత విపరీతంగా పెరిగింది.వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (WEF) అంచనా ప్రకారం, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఆటోమేషన్ వల్ల సుమారు 8.5 కోట్ల ఉద్యోగాలు కనుమరుగవుతాయి. అదే సమయంలో, కొత్తగా 9.7 కోట్ల ఉద్యోగాలు సృష్టించబడతాయి. కానీ ఇక్కడే ఒక మెలిక ఉంది. ఆ కొత్త ఉద్యోగాలకు కావలసిన మేధోశక్తి, సాంకేతిక పరిజ్ఞానం నేటి సగటు యువకుడి వద్ద ఉందా? పాత సిలబస్‌తో పట్టభద్రుడైన అభ్యర్థి కొత్త తరం సవాళ్లను ఎదుర్కోగలడా? ఈ నైపుణ్యాల అసమతుల్యతే నిరుద్యోగానికి ప్రధాన ఇంధనంగా మారుతోంది. మన దేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 1.5 కోట్ల మంది కొత్తగా జాబ్ మార్కెట్‌లోకి అడుగు పెడుతున్నారు. కానీ మన ఆర్థిక వ్యవస్థ సృష్టిస్తున్న ఉద్యోగాల సంఖ్య అందులో పదో వంతు కూడా ఉండటం లేదు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల పట్ల ఉన్న మోజు యువతను 'కోచింగ్ సెంటర్ల' ఊబిలో పడేస్తోంది. ఒక్కో నోటిఫికేషన్‌కు లక్షలాది మంది పోటీ పడటం, ఏళ్ల తరబడి గ్రంథాలయాల్లో మగ్గిపోవడం వల్ల ఉత్పాదక వయస్సు వృథా అవుతోంది.మరోవైపు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన Skill India, Make in India వంటి ప్రతిష్టాత్మక పథకాలు కాగితాల మీద కనిపిస్తున్నంత వేగంగా క్షేత్రస్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సరైన నైపుణ్య శిక్షణ కేంద్రాలు లేకపోవడం, నగరాల్లో కోచింగ్ ఫీజులు చుక్కలను తాకడం వల్ల పేద, మధ్యతరగతి యువత అవకాశాలను అందుకోలేకపోతున్నారు. ఇది సమాజంలో తీవ్రమైన ఆర్థిక అసమానతలకు దారితీస్తోంది.నిరుద్యోగం అనేది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, అది ఒక సామాజిక క్యాన్సర్‌లా మారుతోంది. నెలల తరబడి ఇంటర్వ్యూలకు హాజరవుతూ, రిజెక్షన్ మెయిల్స్ చూస్తూ గడపడం వల్ల యువత ఆత్మవిశ్వాసం అట్టడుగుకు పడిపోతోంది. ఇంటి దగ్గర తల్లిదండ్రుల ప్రశ్నలు, సమాజం వేసే ఎగతాళి చూపులు వెరసి యువతను మానసిక రోగులుగా మారుస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) నిరుద్యోగం కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువతీ యువకుల సంఖ్య పెరగడం అత్యంత ఆందోళనకరం.
దీనికి తోడు సోషల్ మీడియా సృష్టించే మిథ్యా లోకం మరొక పెద్ద సమస్య. ఇన్ స్టాగ్రామ్‌లో స్నేహితులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో, విదేశీ ప్రయాణాలతో పెట్టే పోస్టులు చూసి నేను మాత్రం ఎందుకు ఇలా ఉన్నాను? అనే Fear of Missing అవుట్ (FOMO) యువతను కృంగదీస్తోంది. పక్కవాడి విజయంతో తన జీవితాన్ని పోల్చుకుంటూ, తనలోని ప్రతిభను గుర్తించలేక దిశాహీనులవుతున్నారు.నిరాశ చెందుతూ కూర్చుంటే నిరుద్యోగం పోదు. పరిష్కారం మన ఆలోచనలోనే ఉంది. నేటి కార్పొరేట్ ప్రపంచం కేవలం టెక్నికల్ స్కిల్స్ మాత్రమే చూడటం లేదు. Soft Skills అంటే కమ్యూనికేషన్, లీడర్‌షిప్, టీమ్ వర్క్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ ఉన్నవారికి రెడ్ కార్పెట్ పరుస్తోంది. సర్టిఫికేట్ల కోసం కాకుండా, సబ్జెక్టును ప్రేమించి నేర్చుకోవాలి. డిగ్రీ మధ్యలోనే ఇంటర్న్‌షిప్‌లు చేయడం, లైవ్ ప్రాజెక్టులలో పాల్గొనడం వల్ల రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్ వస్తుంది. ఇది మీ రెజ్యూమెకు బలాన్నిస్తుంది.అంతేకాదు, ఉద్యోగం కోరడం కంటే ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదగడంపై దృష్టి పెట్టాలి. Entrepreneurship (స్టార్టప్ సంస్కృతి) నేడు ఊపందుకుంటోంది. ప్రభుత్వ ముద్రా రుణాలు, స్టార్టప్ ఇండియా పథకాలు, హైదరాబాద్‌లోని THub, WE Hub వంటి ఇంక్యుబేటర్లు యువ పారిశ్రామికవేత్తలకు అండగా నిలుస్తున్నాయి. ఫ్రీలాన్సింగ్, డిజిటల్ మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్ వంటి సృజనాత్మక రంగాల్లో నేడు అవకాశాలకు కొదవ లేదు. పాత పద్ధతిలోనే కాకుండా, కొత్త దారులను వెతుక్కోవడమే నేటి అవసరం. మన విద్యా వ్యవస్థలో National Education Policy (NEP) 2020 ద్వారా ప్రభుత్వం కొన్ని మార్పులు తెచ్చింది. వృత్తి విద్యా కోర్సులు (Vocational Education), ఇండస్ట్రీతో అనుసంధానం వంటివి ఆచరణలోకి వస్తే తప్పకుండా మార్పు వస్తుంది. కానీ ఇది యుద్ధ ప్రాతిపదికన జరగాలి. నిరుద్యోగ సమస్యకు పరిష్కారం కేవలం ప్రభుత్వాల చేతుల్లోనే లేదు. అది విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు మరియు పరిశ్రమల ఉమ్మడి బాధ్యత.యువత తన నైపుణ్యాలను నిరంతరం నవీకరించుకోవాలి (Up skilling). ఒకే డిగ్రీపై ఆధారపడకుండా మల్టీటాస్కింగ్ నేర్చుకోవాలి.విద్యాసంస్థలు కేవలం డిగ్రీ ఫ్యాక్టరీలుగా మిగిలిపోకుండా, విద్యార్థులను భావి భారత నిర్మాతలుగా తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. పరిశ్రమలు పారదర్శకమైన నియామక ప్రక్రియను చేపట్టాలి. అనుభవం లేని వారికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించే మనస్తత్వం పెంచుకోవాలి. భారత యువతలో అద్భుతమైన తెలివితేటలు ఉన్నాయి. సరైన దిశానిర్దేశం, కాస్త ప్రోత్సాహం అందితే ఈ దేశం విశ్వగురువు అవ్వడం ఖాయం. సమస్యలను చూసి వెనకడుగు వేయకుండా, వాటిని సవాళ్లుగా స్వీకరించినప్పుడే నిరుద్యోగ రక్కసిని పారద్రోలగలం. మన శక్తి అపారం.మన గమ్యం సుదూరం. మార్పు ఇప్పుడే, మనతోనే మొదలవ్వాలి!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## కోహినూర్ వజ్రం భారత్‌కు తిరిగి ఇవ్వాలి

### న్యూయార్క్ మేయర్ మమ్దానీ



న్యూయార్క్ వెలుతురు ఏప్రిల్ 30:

చారిత్రక కోహినూర్ వజ్రం భారత్‌కు తిరిగి ఇచ్చేయాలనే అంశం మళ్లీ తెర పైకి వచ్చింది. బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్ 3ని కలిసే అవకాశం వస్తే కోహినూర్ వజ్రాన్ని భారత్‌కు తిరిగి ఇవ్వాలని కోరుతానని న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ తెలిపారు. బుధవారం కింగ్ చార్లెస్ కలవడానికి ముందు జరిగిన విలేకరుల సమావేశంలో బ్రిటన్ రాజుకు మీ సందేశం ఏమిటని ప్రశ్నించగా, ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. భారతీయ మూలాలున్న మేయర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.
'ఒక కార్యక్రమంలో కాకుండా, రాజు చార్లెస్ 3తో విడిగా మాట్లాడే అవకాశం వస్తే కోహినూర్‌ను భారత్‌కు తిరిగి ఇచ్చేయాలని కోరతాను' అని మమ్దానీ తెలిపారు. బ్రిటన్ రాజు చార్లెస్ 3, రాణి కెమిల్లా నాలుగు రోజుల అమెరికా పర్యటనలో బాగంగా ప్రస్తుతం న్యూయార్క్‌లో ఉన్నారు. వన్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ వద్ద 9/11 దాడుల 25వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పటికే 9/11 స్మారక చిహ్నాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమానికి మమ్దానీ కూడా హాజరయ్యారు. కింగ్ చార్లెస్‌ను కలిశారు. ఇద్దరి మధ్య సంభాషణ జరిగింది. కానీ కోహినూర్ గురించి ప్రస్తావించారా లేదా అనేది స్పష్టతలేదు.రాజు,మమ్దానీల మధ్య చర్చల వివరాలను మేయర్ కార్యాలయం వెల్లడించలేదు

**లాహోర్ ఒప్పందం వివాదానికి కేంద్రబిందువు**

కోహినూర్ వజ్రం ప్రపంచంలో అత్యంత వివాదాస్పద రత్నాలలో ఒకటి. మౌంటెన్ ఆఫ్ లైట్‌గా ప్రసిద్ధి చెందిన ఈ వజ్రం భారతదేశంలోని కొల్లూరు గనిలో లభించింది. ఇది 186 క్యారెట్ల బరువు ఉండేది. ముగళులు, సిక్కులు సహా అనేక భారతీయ రాజవంశాల చేతుల్లోకి వెళ్లిన ఈ వజ్రం, 1849లో జరిగిన రెండో ఆంగ్లోసిక్కు యుద్ధం అనంతరం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ చేతికి వెళ్లింది. అప్పటి 10 ఏళ్ల మహారాజా దులీప్ సింగ్‌ను లాహోర్ ఒప్పందంపై సంతకం చేయమని బలవంత చేసింది. దీంతో ఆ ఒప్పందం ద్వారా ఈ వజ్రాన్ని క్వీన్ విక్టోరియాకు అప్పగించారు. అప్పటినుంచి ఆ వజ్రం బ్రిటన్ అధీనంలోనే ఉంది. ప్రస్తుతం 105.6 క్యారెట్లకు కట్ చేసిన కోహినూర్, క్వీన్ ఎలిజబెత్ క్వీన్ మదర్ కిరీటంలో అమర్చబడి ఉంది. టవర్ ఆఫ్ లండన్లో భద్రంగా ఉంది. అయితే భారతీయ చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం, రాజుతో ఒత్తిడిలో కుదిరిన ఒప్పందానికి నైతిక విలువ లేదని చెబుతున్నారు. భారత్‌కు కోహినూర్ ఒక సాంస్కృతిక గర్వ చిహ్నమే కాకుండా, వలస పాలనలో దోపిడీకి ప్రతీకగా భావిస్తారు. దీనిని తిరిగి రాని అత్యంత విలువైన ఆస్తిగా చూస్తున్నారు. కోహినూర్‌ను తిరిగి తీసుకోవాలని భారత ప్రభుత్వం దౌత్యమార్గాల్లో ప్రయత్నిస్తూనే ఉంది. కానీ అది ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. గ్రీస్‌లోని ఎల్గిన్ మార్బుల్స్, ఆఫ్రికాలోని బెనిన్ బ్రాంజెస్ వంటి చారిత్రక వస్తువులను తిరిగి ఇవ్వాలన్న డిమాండ్లు పెరుగుతున్న నేపథ్యంలో, మమ్దాని వ్యాఖ్యలు కూడా అంతర్జాతీయ చర్చకు దారితీస్తున్నాయి. మమ్దాని వ్యాఖ్యలు ఒక సాధారణ దౌత్య భేటీని చారిత్రక న్యాయం అంశంగా మలిచాయి. కోహినూర్ లండన్‌లో ఉన్నప్పటికీ, దాని చుట్టూ జరిగే చర్చ మాత్రం భారత్‌కే కేంద్రీకృతమై ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.
ఇక మంగళవారం వైట్‌హౌస్‌లో స్టేట్ డిన్నర్ కార్యక్రమం జరిగింది. అక్కడ కింగ్ చార్లెస్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలిశారు. ఇరువురు నేతలు బ్రిటన్ అమెరికా సంబంధాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రంప్‌ను బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్3 తీవ్ర స్థాయిలో రోస్ట్ చేశారు. బ్రిటన్ జోక్యం లేకపోయి ఉంటే, అమెరికన్లు ఇప్పటికీ ఫ్రెంచ్ మాట్లాడేవారేమో అని సెటైర్ వేశారు.

# మరోసారి చిక్కుల్లో విజయ్

- **చర్యలు తీసుకోవాలని ఈసీ**
- **పోలీసులకు బాలల కమిషన్ సిఫార్స్**

చెన్నై వెలుతురు ఏప్రిల్ 30:



తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ మరోసారి చిక్కుల్లో పడ్డారు. విజయ్‌పై చర్యలు తీసుకోవాలని తమిళనాడు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పోలీస్ శాఖతో పాటు ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసింది. పిల్లలను భావోద్వేగపరంగా ప్రేరేపించి, టీవీకేకి ఓటు వేసేలా తమ తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చేలా చేసి వారిని ఓట్లు సేకరించే సాధనంగా విజయ్ ఉపయోగించుకున్నారని కమిషన్ పేర్కొంది. ఎన్నికల ప్రచార ప్రసంగాల ద్వారా పిల్లలు తమ తల్లిదండ్రుల ఓటు నిర్ణయాలను ప్రభావితం చేసేలా ప్రేరేపించారన్న ఆరోపణల నేపథ్యంలో కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది.
"ఎన్నికల ప్రచారానికి సంబంధించిన వివిధ చట్టాల ప్రకారం పిల్లలను సహాయకులుగా లేదా సామాన్య ప్రజలను చేరుకోవడానికి ఒక మాధ్యమంగా ఉపయోగించడం నిషేధం. ఈ విషయంలో తమిళ వెట్రి కళగం నాయకుడు జోసెఫ్ విజయ్, ఆయన ప్రచార విభాగం తమ రాజకీయ పార్టీని సామాన్య ప్రజలకు చేరవేయడానికి పిల్లలను సహాయకులుగా, మాధ్యమంగా చాలా చాకచక్యంగా ఉపయోగించుకున్నారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇది ఏమాత్రం అనుమతించే వ్యూహం కాదు. ఈ క్రమంలోనే ఆయన బాలల న్యాయ (సంరక్షణ, రక్షణ) చట్టం, 2015లోని సెక్షన్లు 75, 83లను ఉల్లంఘించారు. అందువల్ల, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు విజయ్‌పై అధికారిక విచారణ జరపాలి.

**తమిళనాడు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్**

మరోవైపు పిల్లలను రెచ్చగొట్టే విధంగా ఉన్న విజయ్ ప్రసంగాలు ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, యూట్యూబ్‌లో ప్రచారం అవుతున్నాయని బాలల కమిషన్ గుర్తుచేసింది. అలాంటి కంటెంట్‌ను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. "అయితే, పెద్దలు ఇలాంటి చట్టపరమైన ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేసే అవకాశం ఉంటుంది. కానీ పిల్లలకు చట్టపరమైన నిబంధనల గురించి అవగాహన ఉండే అవకాశం లేదు. అందువల్లే, పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఈ సంస్థ విజయ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది." అని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పేర్కొంది.
2026 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీవీకే పార్టీ జోరుగా ప్రచారం చేసింది. ఈ క్రమంలోనే ఓ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న విజయ్, పిల్లలు తమ తల్లిదండ్రులను 'ఈలస గుర్తుకు ఓటు వేయమని చెప్పాలంటూ సూచించారు. ఈ ప్రసంగం తర్వాత విజయ్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వివిధ వర్గాల నుంచి అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు తీవ్రమయ్యాయి. రాజకీయ ప్రయోజనాల కోసం పిల్లలను ప్రేరేపించడం చట్టవిరుద్ధమైన చర్య అని విమర్శలు వచ్చాయి.

**ఆలయాలను సందర్శిస్తున్న విజయ్**

ఇదిలా ఉండగా ఎన్నికల ముగిసిన తర్వాత సినీనటుడు, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ వరసగా దేవాలయ పర్యటనలు చేస్తున్నారు. బుధవారం మహారాష్ట్రలోని ప్రసిద్ధ షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. షిర్డీ చేరుకున్న ఆయనకు ఆలయ పూజారులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. సాయిబాబా ఆలయంలో విజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా సమాధిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట టీవీకే పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఉన్నారు. ఈనెల 23న ముగిసిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం విజయ్ ప్రార్థనలు చేశారని టీవీకే వర్గాలు తెలిపాయి. విజయ్ రాకతో షిర్డీ ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. తమ అభిమాన నటుడిని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, అభిమానులు అక్కడికి చేరుకున్నారు.
అంతకుముందు తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా తిరుచెందూరులో ఉన్న ప్రసిద్ధ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు విజయ్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి ఆయుధమైన బల్లెం, శాలువాతో విజయ్‌ను సత్కరించారు. స్వామి నిజరూప దర్శనంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీవీకే ప్రధాన కార్యదర్శి ఆనంద్, ఇతర ముఖ్య నాయకులు ఉన్నారు. విజయ్‌ను చూసేందుకు ఆలయం వద్దకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు.



# ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

- **సన్మానించిన ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్, ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్**

మంచాల వెలుతురు ఏప్రిల్ 30:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో మొత్తం154మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 141మంది విద్యార్థు లు ఉత్తీర్ణత సాధించారు ఈపరీక్షల్లో మొత్తం91.6 శాతంఉత్తీర్ణత నమోదైందిఈ సందర్భంగా మంచాల మండల టాపర్‌గా నిలిచిన ఇంద్రోజ్ శివసాయి 551మార్కులు సాధించి తన ప్రతిభ ను చాటుకున్నారు అలాగే కొల్లోజు వైష్ణవి526 మార్కులు లక్ష్మీఐశ్వర్య 503 మార్కులు కావలి సాహితి502 మార్కులు సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచారు ఈప్రతిభావంతులైన విద్యార్థులను పా ఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు ఈసన్మానకార్యక్రమం తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సిద్ధగోని గిరిధర్ గౌడ్ ప్రిన్సిపాల్ రాములుగారి ఆధ్వర్యంలో ఆరుట్ల గ్రామ సర్పంచ్ మనిపాటి శోభ కుమార్ ఉపసర్పంచ్ నూకంరాజుముదిరాజ్ మరియు పేరెంట్స్ కమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహించారు ఈసందర్భంగా సర్పంచ్ శోభ కుమార్ మాట్లాడుతూ మంచాల మండల టాపర్‌గా మన తెలంగాణ పబ్లిక్ స్కూల్ విద్యార్థి నిలవడం ఎంతో గర్వకారణం భ విష్యత్తులో కూడా మన ఆరుట్ల పాఠశాల రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా ఎదగాలని ఆశిస్తున్నాం అని అన్నారు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు విద్యార్థులు మాట్లాడుతూ తమకు కష్టపడి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు అలాగే మెరుగైన సౌక ర్యాలు కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారుఅంతేకాకుండా తాము ఇంటర్మీడియట్‌ను కూడా ఇక్కడే చదివి తమ లక్ష్యాలను సాధిస్తామని అన్నారు ఈకార్యక్రమంలో ఆరుట్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జిలవర్ష రాములు కె పాపిరెడ్డి ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ సభ్యులు వి ద్యార్థుల తల్లిదండ్రులు తదితరులుపాల్గొన్నారు

## ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో మౌళిక వసతులను అభివృద్ధి పరుస్తాం.



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 30:

గురువారం సీఎంసి కొంపల్లి సర్కిల్ పరిధి విజి హోమ్స్ నందు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా వీధి దీపాలు వెలగకపోవడం, దోమల బెడద, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ, ఫుట్ పాత్ ల నిర్మాణం వంటి సమస్యలను స్థానిక కాలనీలవాసులు ఎమ్మెల్యే కి విన్నవించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పన ధ్యేయంగా గత 12 ఏళ్లుగా కుత్బుల్లాపూర్ లోని జిహెచ్ఎంసి తో పాటు శివారు మున్సిపాలిటీల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనను మరింత అభివృద్ధి చేస్తామని, వీధి దీపాలను వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు దోమల బెడద సమస్యను వెంటనే అరికట్టెందుకు ఫాగింగ్ చేయాలని అధికారులను అదేశించారు .ఈ కార్యక్రమంలో సర్కిల్ ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, ఈఈ సుబ్రహ్మణ్యం, వాటర్ వర్క్స్ డీజీఎం శ్రీవాణి రెడ్డి, ఏఈ శ్రీనివాస్ లతో పాటుగా వివిధ విభాగాల అధికారులు, వీజీ హోమ్స్ వాసులు సతీష్ గౌడ్, పరమేశ్వర్,సూర్య ప్రకాష్, ప్రదీప్, కిరీటి, సురేందర్, ప్రణీత్, రంజిత్, గోపి, భరత్, వినోద్, అరుణ్, సాయి, సతీష్, సుజిత్, శివా, వెంకట్, రమేష్, చక్రి, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సంగీతారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు జెండా కుమార్, తెల్లా వినోద్, పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, నాయకులు వాసుదేవ రెడ్డి మోహన్ రావు, శ్రీనివాస్ రెడ్డి, విమల్, మహిళా నాయకురాలు శారదా, ఇందిరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోకిల నూతన సిఐను కలిసిన మోకిలతాండ గ్రామవాసులు

శంకర్ పల్లి, వెలుతురు ఏప్రిల్ 30 :



మోకిలా నూతన సిఐ గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ రెడ్డిని మోకిలా తండా గ్రామ ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. సిఐకి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోకిల ఎస్ఐలు కోటేశ్వరరావు, చెన్నారెడ్డి, పద్మ మోకిల తాండ గ్రామస్తులు బాబు నాయక్, నార్య నాయక్, కిషన్ నాయక్, గోపాల్ నాయక్, కమల్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నారెడ్డి గూడ ఆగపల్లి చీదేడ్ గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ లు

- **మంజూరు చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు**
- **కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జెనిగే వెంకటేష్ యాదవ్**

మంచాల వెలుతురు ఏప్రిల్ 30:



మంచాల మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లానాయకుడు జెనిగే వెంకటేష్ యాదవ్ మాట్లాడు తూ చెన్నారెడ్డి గూడ ఆగపల్లి చీదేడ్ గ్రామాల్లో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య ఉన్నది అని మూడు గ్రామాలప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిగారి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే చెన్నారెడ్డిగూడ గ్రామంలోనిసర్వేనెంబర్ 1363 లో ఒకఎకరం ఆగపల్లి గ్రామంలోని సర్వేనెంబర్128లోఒక ఎకరం చిదేడ్ గ్రామంలోని స ర్వేనెంబర్ 51 లో ఒకఎకరం విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాలకు ప్రభుత్వం భూమి కేటా యించిం ది ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే సహకారంతో మూడు గ్రామాలకు విద్యుత్ స్టేషన్ లు మంజూరు కావ డంతో చెన్నారెడ్డిగూడ ఆగపల్లి చీదేడ్ గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్యపరిష్కారం అవుతున్నం దుకుహర్షం వ్యక్తం చేస్తున్నారు అడగగానే వెంటనే స్పందించి విద్యుత్ సబ్ స్టేషన్ లు మంజూరు చేసి భూమి కేటాయించిన నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ప్రియతమా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ జిల్లానాయకుడు జెనిగే వెంకటేష్ యాదవ్ మూడు గ్రామాలప్రజలు కాంగ్రెస్ పార్టీనాయకులు

# చింతపల్లిగూడ గ్రామాని పరిశుభ్రంగా ఉంచడంలో అందరూ భాగస్వాములు కావాలి

- **ఎన్నిసార్లు విన్న వించుకున్న పట్టించుకోని కేశవ మెమోరియల్ కళాశాల యజమాన్యం**
- **కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం డాక్టర్ ఉక్కుల అశోక్**

ఇబ్రహీంపట్నం వెలుతురు ఏప్రిల్ 30:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం డాక్టర్ ఉక్కుల అశోక్ మాట్లాడుతూ చింతపల్లిగూడ గ్రామము ప రిధిలోని ప్రగతి వెంచర్ లో ఉన్న కేశవ మెమోరియల్ కాలేజ్ వారు తమకళాశాల నుంచి తెచ్చిన చెత్త చెదారం వేయడముతో పాటు చెత్తను కాల్చివేసి వాటి నుండి బయటకువచ్చే పొగవలన దో మలు వ్యాప్తి చెంది దోమల బెడద ఎక్కువగా ఉంది మరియు దోమలవల్ల కలిగే వ్యాధులు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయి మరియు ఈ దోమలు తరచుగా మలేరియా మరియు డెంగీ వంటి వ్యాధులకు ప్రజలు గురవుతున్నారూ కేశవ మెమోరియల్ కాలేజ్ నుండి బయటకు తెచ్చేతడి చె త్త మరియు పొడిచెత్త మరియు. ఇతర వ్యర్థాలు మరియు ఇతర రసాయనాలు మరియు ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించడం వలన దోమల వ్యాప్తిఎక్కువగా ఉంటుంది కాబట్టి ఈప్రాంతాలలో దోమల బెడద అధికంగా ఉంది కాబట్టి విద్యార్థులకు మరియు గ్రామప్రజలకు హాని కలిగించే విధ ముగా కేశవ మెమోరియల్ కాలేజ్ యాజమాన్యం వ్యవరిస్తుంది ఈవిషయం గురించి మున్సి పా లిటీ అధికారులు మరియు ఇతర సిబ్బంది కూడా చాలాసార్లు పిర్యాదు చేయడం జరిగింది మరి యు కేశవ మెమోరియల్ కాలేజ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు జ రిగింది మరియు ఈసమస్యలపై అధికారుల నిర్లక్ష్యము వ్యహరిస్తున్నా అధికారులపై చర్యలు తీ సుకోవాలని డిమాండ్ చేస్తూ ఈవిషయంపై జిల్లా అధికారులకు మరియు జిహెచ్ఎంసి అధికారు లకు ఫిర్యాదు చేస్తాం అని అన్నారు ఈసమస్య పరిష్కారం



చింతపల్లి గూడ గ్రామంలో రోడ్డుపైనే చెత్త చెదారం

కోసం ఉదయం నుండి విద్యార్థులకు మరియు ప్రజలకు అవగాహన క ల్పించడం జరిగింది మరియుఇబ్బందులు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేకకార్యాచరణతో తడిపొడి చెత్త సేకరణ కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిలని జిల్లా అధికారులను కోరారుఈకార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోగు శేఖర్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అ ధ్యక్షులు జోగు నర్సింహ నాయకులు శేరి రమేష్ ఉడతల రవిగౌడ్ జోగు జంగయ్య గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు

# మంచాల మండల కేంద్రంలో పదవ తరగతి లో ఉత్తీర్ణత సాధించిన తెలంగాణ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు


- **ఘనంగా సన్మానించి అభినందించిన మంచాల గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్**

మంచాల వెలుతురు ఏప్రిల్ 30:




మంచాల మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో పదవతరగతి ఫలితాల్లో 96% ఉ త్తీర్ణత సాధించారు పాఠశాల టాపర్ సబితా 536సిహెచ్ ఝాన్సీ 525 పూజిత 517 మార్కులు సాధించారు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ మంచాల గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస విన య్ విద్యార్థులను శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించి అభినందించారు ఈసందర్భంగా గ్రా మ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ఇంకా బాగా చదివి ఫలితాలు మరింత ఎక్కువ సాధించి మంచాల తెలంగాణపబ్లిక్ పాఠశాలకు ఉ పాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తేవాలని అన్నారు తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు96%ఉత్తీర్ణత సాధించినందుకు గర్వకారణం అని అన్నారు విద్యార్థులకు ప్రత్యేక నిరంతనలు తెలిపారు కార్యక్రమంలో మంచాల గ్రామఉపసర్పంచ్ పందుల లింగంగౌడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ ఉపాధ్యాయుడు మహమ్మద్ సలీం వార్డు సభ్యులు గ్యార జంగయ్య గ్రామస్తులు నారెడ్డి హరికిషన్ రెడ్డి ఏరుకొండ రాములు ఏర్పుల నరసింహ గడ్డం బాబయ్య చెరుకు నరసింహ రావుల శ్రీనివాస్ గ్యారశరత్ కమిటీ సభ్యులు అశ్వల బాలరాజు గ్యార కావ్య విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## నూతన బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కి వినతిపత్రం.



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 30:

సూరారం కాలనీ ప్రధాన రహదారిలోని నారాయణ హాస్పిటల్ ఎదురుగా నూతన బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని కలిసిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వారాల వినోద్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ హాస్పిటల్ ఎదురుగా గల ప్రధాన రహదారిపై బస్ స్టాప్, బస్సు షెల్టర్ ను ఏర్పాటు చేయడం హాస్పిటల్ కి వచ్చి, వెళ్లే గర్భిణీ స్త్రీలు, సీనియర్ సిటిజన్స్ కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వినతిపత్రంలో కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ.... గర్భిణీలు, వయోవృద్ధులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండే ఈ బస్సు స్టాప్ ను వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్ కుమార్, ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, సత్యనారాయణ రెడ్డి, వెంకట్ రెడ్డి, మనీ, సిద్ధి వినాయక నగర్ ఓనర్ అసోసియేషన్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ చిలుకు స్వామికి శ్రమశక్తి అవార్డు

- **మే డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రధానం చేయబోతున్న శ్రమశక్తి అవార్డులలో**



సికింద్రాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:

సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా సేవలు అందజేస్తున్న చిలుకు స్వామి ని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.రేపు రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారి ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రధానము చేయనున్నారు

ఆలేరు మండలం షారాజిపేట గ్రామ నివాసి అయిన స్వామి ఒకవైపు రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూనే గ్రామంలో ఎయిడ్స్ పట్ల అవగాహన రక్త దానము శ్రమదానము శిబిరాలు నిర్వహిస్తూ గ్రామ యువకులను చైతన్య పరుస్తున్నారు. వీరి సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వ కార్మిక శాఖ మేడే సందర్భంగా శ్రమశక్తి అవార్డుకు ఎంపిక చేసింది.చిలుక స్వామికి ఈ గౌరవము లభించడం పట్ల పలువురు రైల్వే ఉద్యోగులు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు పలువురు హర్షం వ్యక్తం చేశారు

# వి.హనుమంతరావుకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



బషీర్ బాగ్ వెలుతురు 30 ఏప్రిల్ :

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి. హనుమంతరావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తౌలుపునూరి కృష్ణ, మాజీ కార్పొరేటర్ పుల్ల నారాయణస్వామి, దిలీప్ కుమార్ నేత తదితరులు

హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

సలహాదారు పదవితో పాటు 'క్యాబినెట్ హోదా'ను కూడా ప్రభుత్వం కల్పించడం సంతోషం వ్యక్తం చేశారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న హనుమంతరావు సేవలను ప్రభుత్వ పాలనలో వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని హర్షం వ్యక్తం చేశారు

# చిన్న వయసులోనే చైతన్యం...

## ప్రతిభతో ముందంజలో గుండా సహస్ర...









వరంగల్ జిల్లా వెలుతురు 30 ఏప్రిల్:

హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుండా సహస్ర చిన్న వయసులోనే తన చురుకుదనం, ఆలోచనా తీరు, ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంటోంది. శ్రీధర్, జ్యోతి దంపతుల కుమార్తె అయిన సహస్ర ప్రస్తుతం 1వ తరగతి చదువుతోంది. చదువుల్లో ప్రతిభ కనబరుస్తూనే ఆటపాటల్లోనూ ముందుండటం ఆమె ప్రత్యేకతగా నిలుస్తోంది.

చిన్న వయసులోనే స్పష్టంగా మాట్లాడే సహస్ర, సమాజంపై అవగాహన కలిగి ఉండటం విశేషం. ముఖ్యంగా వేసవికాలంలో పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ, బయట తిరగకుండా ఇంటి వద్దే ఉండి తల్లిదండ్రులతో సమయం గడపాలని సూచిస్తోంది. అష్టాచమ్మ, పుంజితం, ఓనగుంటలు వంటి సాంప్రదాయ ఆటలను ప్రోత్సహిస్తూ, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని చెప్పడం ఆమె ఆలోచనల లోతును తెలియజేస్తోంది.

సోషల్ మీడియా వేదికగా కూడా సహస్ర తన అభిప్రాయాలను పంచుకుంటూ, చిన్నారుల్లో మంచి అలవాట్లు పెంపొందించేలా సందేశాలు ఇస్తోంది. చదువుపై దృష్టి పెట్టడం, పెద్దలను గౌరవించడం, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం వంటి విషయాలను తన స్నేహితులకు తెలియజేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

సహస్ర కుటుంబానికి గ్రామంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. తాత సూరయ్య గతంలో ఉపసర్పంచ్‌గా పనిచేసి గ్రామ అభివృద్ధికి కృషి చేయగా, తండ్రి శ్రీధర్ కూడా ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండే వ్యక్తిగా పేరుపొందాడు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా స్పందిస్తూ, ప్రజలకు అండగా నిలుస్తున్న తండ్రి సేవా భావం సహస్రపై ప్రభావం చూపింది. అదే మార్గంలో ఆమె కూడా చిన్న వయసులోనే సమాజంపై అవగాహన పెంపొందించుకుంటూ ముందుకు సాగుతోంది.

పెద్దలతో స్నేహపూర్వకంగా మాట్లాడటం, గ్రామస్తులను పలకరించడం, సమస్యలపై చర్చించడం వంటి లక్షణాలు సహస్రలో కనిపించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తన స్నేహితులకు మంచి సలహాలు ఇస్తూ, చదువుతో పాటు మంచి ప్రవర్తన కూడా అవసరమని చెప్పడం ఆమె ప్రత్యేకత.

చిన్న వయసులోనే ఇంత బాధ్యతాయుతంగా ఆలోచిస్తూ, చదువులోనూ ముందంజలో ఉండటం సహస్రను ఇతర పిల్లలకు ఆదర్శంగా నిలబెడుతోంది. గ్రామస్తులు, స్థానిక నాయకులు కూడా ఈ చిన్నారి ప్రతిభను మెచ్చుకుంటూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుతుందని అభిప్రాయపడుతున్నారు.

తమ కూతురు చదువులో ముందుండి, ప్రతి విషయంలో చురుకుదనంతో రాణించడం తమకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. సరైన మార్గదర్శకత్వం, కుటుంబ విలువలు ఉంటే చిన్న వయసులోనే పిల్లలు ఎంత పెద్ద మార్పు తీసుకురాగలరో సహస్ర ఉదాహరణగా నిలుస్తోంది.

# ముగిసిన టెక్నోస్మానియా 2కే26

- **విజేతలకు బహుమతులు అందచేసిన ప్రిన్సిపల్ వి రమేష్ కుమార్, కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్ శ్రీను నాయక్**



వెలుతురు సికింద్రాబాద్ ప్రతినిధి/ ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 30:

ఓయు టెక్నాలజీ కళాశాలలో మూడు రోజుల నుండి జరుగుతున్న జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ నేడు ముగిసింది.

ఉదయం టెక్స్ క్రోమా లో మరియు టెక్నోఫార్మా కాన్ఫరెన్స్ లు జరిగాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి మాట్లాడుతూ టెక్నోస్మానియా కార్యక్రమాన్ని అభినందించారు.

ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు నిర్వహించే ఈ కార్యక్రమం విద్యార్థుల లోని సృజనాత్మక ను వెలికి తీయడాని ఉపయోగ పడుతుందని తెలిపారు.

డీన్ డెవలప్మెంట్ అండ్ యూ.జి.సి. ప్రొఫెసర్ బి.లావణ్య మాట్లాడుతూ ఓయు టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల లో నాయకత్వ లక్షణాలు అలవడతాయి అన్నారు.

ఈ కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్. శ్రీను నాయక్ మాట్లాడుతు మూడు రోజులు గా చేసిన వివిధ కార్యక్రమాల గురించి తెలిపారు. అంతరం ఓయు టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. రమేష్ కుమార్ మాట్లాడుతు టెక్నోస్మానియా కార్యక్రమం మూడు రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలతో చాలా బాగా నిర్వహించారనీ విద్యార్థులను మరియు కన్వీనర్ ను అభినందించారు.

వివిధ కార్యక్రమాల లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అనంతరం డాన్సులు మరియు సాంస్కృతిక కార్యక్రమాలతో అంబరాన్ని అంటేలా టెక్నోస్మానియా ముగిసింది.

ఈ కార్యక్రమంలో టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.రమేష్ కుమార్, టెక్నోస్మానియా కన్వీనర్ ఎస్. శ్రీను నాయక్, డీన్ ఫాకల్టీ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ చింత సాయిలు,హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆచార్య బి.రాజం, హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్స్టైల్ టెక్నాలజీ ప్రొఫెసర్ జె.హయవదన, ఫాకల్టీ కోఆర్డినేటర్ లు డా.బి. పరమేశ్వర్లు, డా. ఎస్. ఐలయ్య, డా.వి.భాస్కర్, డా.కె.శ్రీనివాస్, డా.పి.అరుణా దేవి, డా.ఎ.పరశురామ్ , డా.టి.జ్యోతి, డా.పి. సునిత, డా.ఎ.కవిత, డా.అర్జున్, డా.ధీరజ్, డా .రేణు,డా.ఎం.రమేష్, డా.సమీ, డా.ఎ.విజయ కాంత్, డా.టి.వెంకటేశ్వర్లు, డా.సర్దార్ జస్పాల్ సింగ్, డా.విజయ లక్ష్మి, డా.అజిత్ , డా.అభిలాష్,స్టూడెంట్ కోఆర్డినేటర్స్ , సి.హెచ్.సాయి కుమార్, ఎస్.లావణ్య, అజిత్, ఎం.సాయి కుమార్, ప్రదీప్, వినూత్న, హర్షిత, ఇతర స్టూడెంట్ కోఆర్డినేటర్ లు , కలశాల అధ్యాపకులు,విద్యార్థులు మరియు ఉద్యోగులు పాల్గొనారు.

# హిమాయత్ నగర్ సమస్యలపై జలమండలికి వినతిపత్రం

- **స్పందించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్**
- **ప్రజల ఇబ్బందులపై నారాయణగూడ కార్యాలయంలో మేనేజర్‌తో భేటీ**





హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:

హిమాయత్ నగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి, డ్రైనేజీ సమస్యలపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్ స్పందించారు. డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆదేశాల మేరకు, స్థానిక బస్తీవాసులతో కలిసి ఆయన నారాయణగూడలోని జలమండలి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జలమండలి మేనేజర్ మునావర్‌ను కలిసి డివిజన్‌లో నెలకొన్న తాగునీటి ఎద్దడి, తక్కువ పీడనంతో నీటి సరఫరా, నీటి కాలుష్యం వంటి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఆరోగ్యం, ప్రాథమిక అవసరాల దృష్ట్యా ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు.

**హైదర్గూడ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్ డిమాండ్**

ముఖ్యంగా హైదర్ గూడలోని డీమార్ట్ ఎదురుగా ఉన్న కాలనీలో చాలా కాలంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని రామన్ గౌడ్ మేనేజర్‌కు వివరించారు. కింగ్ కోటి ప్రాంతం నుండి వస్తున్న డ్రైనేజీ నీరు కాలనీలోకి ప్రవేశిస్తోందని, దీని వల్ల స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసుల తరపున వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాకీ, శేఖర్, నదీమ్, జోసెఫ్, బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు.

# నర్సంపేటలో దత్తతపై అవగాహన

## – చట్టబద్ధ మార్గాలపైనే ప్రాధాన్యం...









వరంగల్ జిల్లా వెలుతురు 30 ఏప్రిల్:

నర్సంపేట పట్టణంలో చైల్డ్ సేఫ్టీ వీక్ సందర్భంగా దత్తత (అడాప్షన్) మరియు ఫాస్టర్ కేర్‌పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా జరిగే దత్తతలు, బాలల అక్రమ రవాణా, అమ్మకం వంటి ఘటనలను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇటువంటి అనుమానాస్పద ఘటనలు ఎక్కడైనా గమనించినట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

దత్తత ప్రక్రియను తప్పనిసరిగా చట్టబద్ధ మార్గాల్లోనే చేపట్టాలని, అధికారిక అనుమతులు లేకుండా పిల్లలను దత్తత తీసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఫాస్టర్ కేర్ ద్వారా అనాథ, నిరాధార పిల్లలకు తాత్కాలిక సంరక్షణ అందించడం కూడా సమాజంలో ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

పిల్లల భవిష్యత్తు సురక్షితంగా ఉండేందుకు ప్రభుత్వంతో పాటు సమాజం కూడా చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బాలల హక్కుల పరిరక్షణలో ప్రజల సహకారం అత్యంత అవసరమని వివరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీఎం&హెచ్ఓ సాంబాశివరావు, డీడబ్ల్యూఓ రాజమణి, ఆర్డీఓ ఉమారాణి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీసీపీఓ ఉమా, ఏహెచ్‌టీయూ ఇన్స్పెక్టర్ శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# మే డే శుభాకాంక్షలు

- **ఎంసీపీఐయూ మండల సహాయ కార్యదర్శి గూడ సురేష్డాక్టర్ సాబ్‌కు కృతజ్ఞతలు...**



వరంగల్ జిల్లా వెలుతురు 30 ఏప్రిల్:.

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా వరంగల్ జిల్లా గీసుకొండ మండలానికి చెందిన ఎంసీపీఐయూ మండల సహాయ కార్యదర్శి గూడ సురేష్ కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికుల హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని, సమాజ అభివృద్ధికి కార్మికుల శ్రమే ప్రధాన శక్తి అని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరింత చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే, ఈ సందర్భంగా డాక్టర్ సాబ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి మార్గదర్శకత్వంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి కొనసాగుతుందని తెలిపారు.

ఓంకార్ కాలనీ వాసులకు మరియు ఎంసీపీఐయూ జిల్లా, మండల నాయకులకు కూడా ప్రత్యేకంగా మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికులు ఐక్యతతో ముందుకు సాగి తమ హక్కులను సాధించుకోవాలని గూడ సురేష్ పిలుపునిచ్చారు.

చివరిగా మండలంలోని కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు.

# యాదగిరిగుట్టలో ఘనంగా నాగార్జున గ్రామీణ బ్యాంకు స్వర్ణ జయంతి ఉత్సవాలు

- **ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్ సుభాష్ రెడ్డి, పెద్ద ఎత్తున హాజరైన అతిరథ మహారధులు**
- **నాగార్జున బ్యాంకు 50 సంవత్సరాల విజయవంతమైన ప్రస్థానంపై అతిధులు, ఉద్యోగులు , మాజీ ఉద్యోగుల భావోద్వేగ ప్రసంగాలు**

**యాదగిరిగుట్ట ఏప్రిల్ 30 వెలుతురు న్యూస్:**



నాగార్జున గ్రామీణ బ్యాంక్ స్వర్ణ జయంతి ఉత్సవాలు యాదగిరిగుట్టలో అంగరంగ వైభవంగా జరిగాయి. యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు సత్రం ట్రస్ట్ ప్రాంగణంలో ఈ వేడుకలు వైభవంగా నిర్వహించారు

ఈ వేడుకలను తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్ సుభాష్ రెడ్డి హాజరై ప్రసంగించారు. నాగార్జున బ్యాంకు స్వర్ణజయంతి ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆనందదాయకమని ఆయన అన్నారు యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో ఈ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. ఒక బ్యాంకు 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అంటే మామూలు విషయం కాదని ఆయన అన్నారు . 50 సంవత్సరాల కాలంలో నాగార్జున గ్రామీణ బ్యాంకు ప్రజలకు ఖాతాదారులకు అందించిన సేవలు ఎంతో అమోఘమైనవని ఆయన అన్నారు. ముున్ముందు ఈ బ్యాంకు మరిన్ని అద్భుతమైన సేవలు అందిస్తూ మరెన్నో ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఆకాంక్షిస్తున్నామని ఆయన అన్నారు. అదేవిధంగా కార్యక్రమానికి హాజరైన పలువురు అతిథులు మాట్లాడుతూ నాగార్జున గ్రామీణ బ్యాంక్ అంటేనే లాభార్జన ఆశించని బ్యాంక్ అని అన్నారు. ఖాతాదారుల సేవలకి అంకితమై , త్యాగాలకు సంసిద్ధమైన బ్యాంక్ గా నాగార్జున బ్యాంకు పేరు పొందిందని అన్నారు . చిన్న సన్నకారు రైతుల సంక్షేమానికి వృత్తి వ్యాపారుల అభివృద్ధికి , పేదలకు అన్ని సమయాలలో అక్కరకు వచ్చే బ్యాంకుగా నాగార్జున బ్యాంకు ప్రసిద్ధి చెందడం గర్వకారణం అని అన్నారు. అన్ని బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తూ సీనియర్ సిటిజన్స్ కి ఈ బ్యాంకు ఎప్పుడు అండగా నిలబడుతుందని అన్నారు. ప్రజలు, ఖాతాదారులకు నిరంతరం సేవలు అందించడంలో నాగార్జున బ్యాంకు ఎప్పుడు ముందుంటుందని అన్నారు. 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నాగార్జున గ్రామీణ బ్యాంకు స్వర్ణోత్సవ సంబరాల పండుగను జరుపుకోవడం మనందరికీ ఆనందదాయకమని అన్నారు.

ఈ కార్యక్రమంలో నాగార్జున గ్రామీణ బ్యాంక్‌కు చెందిన పలువురు సీనియర్ సిబ్బంది కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీనియర్ సిబ్బందిని గౌరవించి, పూలమాలు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ జూబ్లీ వేడుకల కమిటీ చైర్మన్ మారిశెట్టి వీరయ్య , తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కుంభం వెంకట్ రెడ్డి లు సభను నిర్వహించి సభలో పాల్గొనీ విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు అదేవిధంగా కార్యక్రమానికి హాజరైన అతిధులను ఘనంగా సత్కరించారు . కార్యక్రమ వివరాలను అజెండాను వారు సభకు వివరించారు. తెలంగాణ రాష్ట్రం నలుమూలాల నుండి మండే ఎండలను సైతం లెక్కజేయకుండా పూర్వ నాగార్జున గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు , దూర ప్రాంతాలైన విశాఖపట్నం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు తదితర ప్రాంతాల నుండి రెండు తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున నాగార్జున బ్యాంకు ఉద్యోగులు పూర్వ ఉద్యోగులు ఖాతాదారులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతిథులకు జ్ఞాపకాలు అందించి పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ పి.మోహనయ్య , తెలంగాణ గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ సుశాంత్ , సంగమేశ్వర గ్రామీణ బ్యాంకు మాజీ చైర్మన్ ఐ. రామచంద్ర రెడ్డి గణపతి హెగ్డే , బి. రాజారావు కె.టి. రాజు , పి.ఎస్.ఎం. రావు , తెలంగాణ గ్రామీణ బ్యాంకు యాదగిరిగుట్ట బ్రాంచ్ మేనేజర్ శాలిని , బి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట ఆలయంలో...యజ్ఞ , యాగాదులకు మోదుగు సమిధలు అందజేసిన వడ్లోజు వెంకటేష్

**యాదగిరిగుట్ట , ఏప్రిల్ 30 వెలుతురు న్యూస్**





టీటీడీ లోకల్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు, వైఎస్సార్సీపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వడ్లోజు వెంకటేష్ యాదగిరిగుట్ట దేవస్థానంలో జరిగే యజ్ఞ యాగాదులకు సుమారు 60 వేల రూపాయల విలువ గల 30 క్వింటాళ్ల మోదుగు సమిధలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గత 20 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత మహానేత వైఎస్సార్ పేరు మీదుగా ఈ సమిధలను యాదగిరిగుట్ట దేవస్థానంలో స్వామివారి యజ్ఞ యాగాదులకు అందజేస్తున్నానని తెలిపారు. అదేవిధంగా వైయస్సార్ తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేరు మీద కూడా ఈ సమిధలను యాదగిరిగుట్ట దేవస్థానానికి అందిస్తున్నామని అన్నారు. స్వామివారి జయంతి ఉత్సవాల సందర్భంగా 60 వేల రూపాయల విలువగల 30 క్వింటాళ్ల మోదుగు సమిధలను అందించామని అన్నారు. శివాలయంలో జరిగే రుద్ర యాగానికి అదేవిధంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో నిర్వహించే శ్రీ సుదర్శన నరసింహ హోమం తదితర యజ్ఞ యాగాదులకు ఈ మోదుగు సమిధలను అందించామని తెలిపారు. యాదగిరిగుట్ట ఆలయంలో ప్రతినిత్యం జరిగే హోమం యజ్ఞ యాగాదులకు తాము క్రమం తప్పకుండా మోదుగు సమిధలను అందజేస్తున్నామని వివరించారు. అదేవిధంగా వైఎస్ఆర్సిపి రాష్ట్ర నేత వైవి సుబ్బారెడ్డి పుట్టినరోజు మే 1వ తేదీన ఉన్నందున ఆయన పేరున కూడా మోదుగు సమిధలను ఆలయానికి అందించామని అన్నారు. మే 1వ తేదీన వైఎస్ఆర్సిపి రాష్ట్ర నేత వైవి సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. పేదలకు అన్నదానం వివిధ సామాజిక సేవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నమని వైయస్సార్ అభిమానులు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వైఎస్ఆర్సిపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు టిటిడి లోకల్ అడ్వైజర్ బోర్డు మాజీ సభ్యులు వడ్లోజు వెంకటేష్ పిలుపునిచ్చారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

**గుండాల ఏప్రిల్ 30(వెలుతురు)::**



యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలం, అనంతారం గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రానికి గ్రామం నుండి ఎన్ని లారీల ద్వారా ధాన్యం రవాణా అవుతోందో, గన్ని సంచులు (బ్యాగులు) సరిపడా ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్, లారీల కొరతను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. అకాల మరణం చెందిన యువకుడు భూపతి కుటుంబాన్ని పరామర్శించి, ఆయన భార్య విద్యావంతురాలు అయితే ప్రభుత్వ ఉద్యోగం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల వినోద్, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో చండీరాణి, ఆర్ఐ ప్రభుదాస్, ఎంపీఓ ఎం.ఏ. సలీం, పీఆర్ఏఈ దామోదర్, వ్యవసాయ అధికారి సూరజ్, హౌసింగ్ ఏఈ కావ్య, ఉప సర్పంచ్ సంపత్ కుమార్, సీఈఓ నాగయ్య, వార్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన నిరుపేద యువకుని చికిత్స కు ఆర్థిక సహాయం అందజేత

- **పలు సామాజిక సేవలో మన మోత్కూర్ వాట్సాప్ గ్రూప్**

**మోత్కూర్, ఏప్రిల్ 30,(వెలుతురు న్యూస్ ):**



మానవ సేవయే మాధవ సేవగా ఎంతోమంది నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తూ మన మోత్కూర్ వాట్సాప్ గ్రూప్ సభ్యులు మరోసారి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న నిరుపేద యువకుడికి ఆర్థిక సహాయం అందించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన సీపీఐ నాయకులు, మాజీ ఆంధ్రభూమి రిపోర్టర్ కీ.శే. కె. నర్సయ్య కుమారుడు శ్రీనాథ్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన గాంధీ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన శ్రీనాథ్, ఆసుపత్రి ఖర్చులకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, మన మోత్కూర్ వాట్సాప్ గ్రూపును ఆశ్రయించారు. దీనికి వెంటనే స్పందించిన గ్రూప్ దాతలు, సభ్యులు స్పందించి, విరాళాలు సేకరించారు. సేకరించిన రూ. 53 వేల చెక్కును బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు గనగాని నర్సయ్యల చేతుల మీదుగా అందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో స్ఫూర్తినిస్తాయని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, మాజీ ఎంపీటీసీ ఎం. జయశ్రీ, సీనియర్ జర్నలిస్ట్ ఎస్ ఎన్ చారి,వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, ఎడ్ల శ్రీనివాస్, మొగుల్లపల్లి సోమయ్య, గాదెనబోయిన నాగరాజు, మొరిగాల శ్రీను, కోమటి జనార్ధన్, కూర్మిళ్ల రాములు, గుంటి దేవా, రేవంత్ , ఇక్కరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుని మరణం... కుటుంబానికి అండగా నిలిచిన పదవ తరగతి మిత్రులు

- **రూ.63,500 ఆర్థిక సహాయం అందజేసిన 1998–99 బ్యాచ్.**

**నార్కట్పల్లి ఏప్రిల్ 30 వెలుతురు న్యూస్:**



నార్కట్పల్లి మండలం తొండలవాయి గ్రామానికి చెందిన శ్రీను ఆకస్మిక మరణంతో విషాదంలో ఉన్న కుటుంబానికి ఆయన పదవ తరగతి స్నేహితులు అండగా నిలిచారు. మిత్రులు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పడంతో పాటు రూ.63,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చింత సుధాకర్, పి. కవిత, సిహెచ్. స్వర్ణలత, రెడ్డిపల్లి లింగయ్య, అవిశెట్టి నాగరాజు, మోత్కూరు లింగాచారి, జాల మల్లేష్, బట్టు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

**నార్కెట్ పల్లి , ఏప్రిల్ 30 వెలుతురు న్యూస్:**



నార్కెట్ పల్లి మండలం మాధ ఏడవెల్లి గ్రామానికి చెందిన పైళ్ల శ్రీనివాస్-సుజాత దంపతుల కుమార్తె పైళ్ల చైతన్య రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలు, నిస్సహాయులు, బాటసారులు కలిపి సుమారు 100 మందికి భోజనం వడ్డించారు. “మనం స్వచ్ఛంద సంస్థ”లో ఇది 550వ రోజు కార్యక్రమంగా, నాలుగోసారి అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని పైళ్ల శ్రీనివాస్ తెలిపారు. ధైధ నాగరాజు మాట్లాడుతూ... ముఖ్యమైన రోజుల్లో గుడుల్లోనే కాకుండా అవసరమైన చోట దానం చేయడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. దేవుడు ఎక్కడ చేసిన దానాన్నైనా గమనిస్తాడని, గుడిలో మాత్రమే చేయాలి అనే అపోహను విడిచిపెట్టాలని సూచించారు. రోడ్లపై అనేక మంది నిస్సహాయులు ఉన్నారని, వారికి మనమే చేయూత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు

# గుండాల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం. శోభన్ బాబు బాధ్యతలు స్వీకారం

**గుండాల ఏప్రిల్ 30(వెలుతురు) :**



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం. తేజం రెడ్డి బదిలీపై వెళ్లడంతో, ఆయన స్థానంలో ఎం. శోభన్ బాబు గురువారం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులు లేదా పనులు ఉన్నా ప్రజలు నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. మండలంలో శాంతిభద్రతలు కాపాడటం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోలీస్ శాఖ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# విద్యార్థిని అభినందించిన గ్రామ సర్పంచ్ కునూరు సాయికుమార్ గౌడ్.

**రామన్నపేట ఏప్రిల్, 30 (వెలుతురు న్యూస్ ):**



పదో తరగతి ఫలితాల్లో రామన్నపేట మండలంలోని బోగారం గ్రామానికి చెందిన రామన్నపేట మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమారమేష్ కుమారుడు సద్గురు యాదవ్ కు 532/ మార్కులు]సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచిన బోగారం గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ గురువారం రోజున ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి నివాసానికి నేరుగా వెళ్లిన సర్పంచ్, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి శాలువా కప్పి, మిఠాయిలు తినిపించి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చి, పట్టుదలతో చదివి ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. విద్యార్థి తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందని, భవిష్యత్తులో ఈ విద్యార్థి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామంలోని ఇతర విద్యార్థులు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ స్వయంగా తమ ఇంటికి వచ్చి ప్రోత్సహించడం పట్ల విద్యార్థి మరియు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగారం ఉపసర్పంచ్ బైకానీ ఉమా, మహేష్ యాదవ్ ఒకటో వార్డు మెంబర్ గోగు ప్రమీల, రమేష్ యాదవ్ ఐదో వార్డ్ మెంబర్ నేరటి మానస, సురేష్ యాదవ్ ఆరో వార్డు మాజీ వార్డు మెంబర్ కూనూరు రాజు, వనం సిద్దేశ్వరి, కునూరు మహేష్ గౌడ్, గోగు మధు యాదవ్, గోగు సత్యనారాయణ యాదవ్, బడుగు శివ, నేత కొక్కుల శంకర్, మేడి కృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది.

# చిన్న పాక అనిత అకాల మరణం నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



- **20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన చిరుమర్తి లింగయ్య**

**రామన్నపేట ఏప్రిల్, 30 (వెలుతురు న్యూస్ ):**

నకిరేకల్ నియోజకవర్గం రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు చిన్న పాక సురేష్ సతీమణి అనిత అకాల మరణం చెందగా వారి మృతదేహానికి పూలమాల వేసి 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చిన నకిరేకల్ మాజీ శాసనసభ్యుల చిరుమర్తి లింగయ్య.

# "మిషన్ వాత్సల్య " సేవల కోసం దరఖాస్తు చేసుకోవాలి




**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 30:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బాల భద్రత వారోత్సవాల్లో సందర్భంగా "దత్తత సహాయ కేంద్రం "గురించి కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్లో ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు బస్సుల్లో ప్రయాణం చేసేటటువంటి ప్రయాణికులకు లీగల్ గా మహిళా శిశు సంక్షేమ శాఖ లోని "మిషన్ వాత్సల్య " సేవల ద్వారా దంపతులు దరఖాస్తు చేసుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ రాజేశం, కంట్రోలర్ శ్రీనివాస్ చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ గారు, మిషన్ వాత్సల్య సిబ్బంది సిబ్బంది సాదినేని రమేష్ చైల్డ్ హెల్ప్ లైన్ ప్రతినిధి సుందరగిరి సాయికిరణ్ గౌడ్ ,ప్రయాణికులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం: మంత్రి శ్రీధర్ బాబు




**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 30:**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎట్టి పరిస్థితుల్లోను నిర్దేశించిన లక్ష్యాల మేరకు ముందుకు సాగాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేసారు. ఇందిర్మ గృహాల నిర్మాణంపై ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వం రూ.5,808 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఏటా 3,500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. గురువారం నాడు హిమాయత్ నగర్ లోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 13 శాసనసభ నియోజకవర్గాల ఇందిరమ్మ ఇళ్ల పనుల సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. రెవిన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, లక్ష్మణకుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంపీలు, ఎంఎల్యేలు, ఎంఎల్సీలు, కార్పోరేషన్ ఛైర్మన్లు, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వి.పి గౌతమ్, కలెక్టర్లు, పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. అటవీ భూములకు సంబంధించిన అంశాలను ఆ శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఫారెస్ట్ క్లియరెన్సుల కారణంగా ఇళ్ల నిర్మాణం కుంటుపడటానికి వీలు లేదని పేర్కొన్నారు. కలెక్షర్లు తమ విచక్షణాధికారాలను ఉపయోగించి ఫారెస్టు భూముల పరిహారం లాంటి అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. క్షేత్ర స్థాయిలో కూడా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. కలెక్టర్లు నిబంధనల పేరుతో జాప్యం చేయకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. గృహ నిర్మాణాల లక్ష్యాలను చేరుకోలేని అధికారులను ఉపేక్షించేది లేదని శ్రీధర్ బాబు హెచ్చరించారు.

# వేముల వీరేశంను మర్యాదపూర్వకంగా కలిసిన పిఏసిఏస్ ఛైర్మన్ నంద్యాల బిక్షంరెడ్డి



**రామన్నపేట ఏప్రిల్, 30 (వెలుతురు న్యూస్ ):**

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 30: మండల పి ఏ సి ఎస్ చైర్మన్ పదివిని పొడిగించిన సందర్భంగా ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వేరేశం మర్యాదపూర్వకంగా కలిసిన రామన్నపేట పి ఏ సి ఎస్ చైర్మన్. నంద్యాల బిక్షం రెడ్డి టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర , మాజీ సర్పంచ్ గుత్తా నరసింహారెడ్డి. పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థినికి ఘన సత్కారం – టౌన్ టాపర్‌గా బిజీ చిన్మయి విజయం

- **చదువుపట్ల ఆసక్తి ఉంటే ఎక్కడైనా రాణించవచ్చు....**
- **ఆర్ ఎల్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్ లక్ష్మారెడ్డి....**

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:**



చదువు పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులు ఎక్కడ ఉన్నా తమ ప్రతిభతో ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆర్ ఎల్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తమ విద్యాసంస్థలో పదవ తరగతి విద్యను అభ్యసించిన బిజీ చిన్మయి 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించి పట్టణ టాపర్‌గా నిలిచిన సందర్భంగా, పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించగలుగుతారని, కానీ అందులో కొందరు మాత్రమే తమ ప్రతిభను ప్రత్యేకంగా చాటుకుంటారని అన్నారు. అలాంటి ప్రతిభావంతులలో బిజీ చిన్మయి ఒకరని, ఆమె సాధించిన విజయం తమ విద్యాసంస్థకు గర్వకారణమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఆర్ ఎల్ ఆర్ విద్యాసంస్థలను స్థాపించామని ఆయన చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఏమాత్రం తగ్గకుండా, గ్రామీణ విద్యార్థులు కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని తమ ప్రయత్నమని పేర్కొన్నారు. విద్యార్థులకు అక్షరజ్ఞానం మాత్రమే కాకుండా, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేలా మార్గదర్శనం చేస్తూ, వారిని మాణిక్యాల్లా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. బిజీ చిన్మయి సాధించిన 586 మార్కులు ఆమె కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శనం, తల్లిదండ్రుల ప్రోత్సాహానికి నిదర్శనమని అన్నారు. ఆమె టౌన్ టాపర్‌గా నిలవడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినికి శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు చిన్మయిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# పదవ తరగతి ఫలితాలలో జిల్లాస్థాయిలో మంచి మార్కులు సాధించిన టీ. వీక్షణ రెడ్డి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 30:**




పదవ తరగతి ఫలితాల్లో కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఆర్ఆర్ స్కూల్ విద్యార్థిని టి. వీక్షణ రెడ్డి 577 మార్కులు సాధించి అత్యుత్తమైన ప్రతిభను కనబరిచి జిల్లాస్థాయిలో మంచి మార్కులు సాధించింది. మరియు శ్రీ మేధా 569, పృథ్విజ 566, ఎం.డి. సుఫియాన్ 563, ఎస్ లక్ష్మి నివాస్ రెడ్డి 561, మార్కులు సాధించినందుకు, ప్రతిభను కనబరిచినందుకు విద్యార్థులను ఆర్ఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ టీ. నరేందర్ రెడ్డి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు. మండలంలో విద్య ప్రమాణాలు మెరుగుపడతాయని భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని, అలాగే తమ విద్యా సంస్థలు అనుభవం అంకితభావం కలిగిన బోధన సిబ్బంది ఉండటం వలన ఈ సంచలన విజయాలు సాధించడం సాధ్యమైందని , విద్యార్థులు విజయం సాధించేలా పటిష్టమైన పునాదిని ఏర్పరుస్తుందని వారి ఉజ్వల భవిష్యత్తుకు నిరంతరము కృషి చేస్తామని, ఎస్ఎస్సి లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రోత్సహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు బోధన బోధనంతర సిబ్బందికి పాఠశాల తరఫున ప్రిన్సిపల్ టీ. నరేందర్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు.

# హిందూ సనాతన ధర్మసేవ సమితి ఆధ్వర్యంలో భాగ్యనగర్ కాలనీలో ప్రతిరోజు అంబలి, మజ్జిగ వితరణ

- **అంబలి, మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించిన నగర మేయర్ కొలగని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 30:**



హిందూ సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో 49వ డివిజన్ భాగ్యనగర్ కాలనీలోని యూనియన్ బ్యాంక్ ముందు ప్రతిరోజు అంబలి, మజ్జిగ వితరణ చేపట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు.. గురువారం రోజున గాండ్ల మహదేవ్ పుట్టినరోజు సందర్భంగా 49వ డివిజన్లోని భాగ్యనగర్ లో అంబలి వితరణ చేపట్టారు. ఇట్టి అంబలి వితరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎండాకాలంలో వేడిమిని తట్టుకోవాలంటే అంబలి ,మజ్జిగ పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. భాగ్యనగర్లో మజ్జిగ, అంబలి వితరణ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాష్, బండ రమణారెడ్డి, బోయిన్పల్లి ప్రవీణ్ రావు, గాజా రమా శివరాం, కర్రె పద్మ అనిల్. సనాతన ధర్మ సేవా సమితి సభ్యులు భూమ రావు, ఈగం రవికుమార్, నారోతం రెడ్డి, లంబ సుధాకర్ రెడ్డి, నలమాచూ సంతోష్, రాజు, ముదుగంటి ప్రవీణ్, ఎన్నం ప్రవీణ్, అప్పాల శ్రీనివాస్, పచ్చునూరి నరేందర్, నందెల్లి జమున, శిరీష, విజయ లక్ష్మి, అమలా తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి మరో భారీ పెట్టుబడి

- **పెట్టుబడులకు టైటాన్ డిఫెన్స్ గ్రూప్ ఆసక్తి**
- **- మంత్రి జనార్దన్ రెడ్డితో టైటాన్ డిఫెన్స్ గ్రూప్ ప్రతినిధుల భేటీ**

**అమరావతి వెలుతురు ఏప్రిల్ 30:**



ఆంధ్రప్రదేశ్‌లో రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి టైటాన్ డిఫెన్స్ గ్రూప్ ఆసక్తి వ్యక్తం చేసింది. టైటాన్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ ఛైర్మన్, సీఈవో కె. గిరి కుమార్ నేతృత్వంలోని సంస్థ ప్రతినిధులు రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని సచివాలయంలో కలిశారు. ఈ భేటీలో టైటాన్ డిఫెన్స్ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అవకాశాలను చర్చించింది. ముఖ్యంగా కర్నూలు ఎయిర్‌పోర్టులో ఎమ్ఆర్‌వో (మెయింటనెన్స్ రిపేర్ అండ్ ఓవర్ హాల్ సెంటర్ సిమ్యులేషన్ సెంటర్ ఏర్పాటు చేయడానికి సంస్థ ఆసక్తి చూపింది. అలాగే నంద్యాల జిల్లాలో డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ స్థాపించాలని ప్రతినిధులు మంత్రికి తెలిపారు. టైటాన్ డిఫెన్స్ సంస్థ ప్రతినిధులు ఏవియేషన్, ఏరోస్పేస్, రక్షణ (డిఫెన్స్) మైనింగ్ రంగాల్లో తమ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక అనుభవం నైపుణ్యాన్ని మంత్రికి వివరంగా తెలిపారు. ఈ రంగాల్లో అధునాతన సాంకేతికత మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో తాము కీలక పాత్ర పోషించగలమని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి అనుకూలమైన వాతావరణం ఉంది. సుస్థిర పాలన, పారదర్శక వ్యవస్థలు, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి" అని టైటాన్ సంస్థ ప్రతినిధులకు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే ఏ సంస్థకైనా ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయం మరియు సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఏవియేషన్, ఏరోస్పేస్ మరియు రక్షణ రంగాల్లో టైటాన్ డిఫెన్స్ సంస్థతో కలిసి పని చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ భేటీలో రాష్ట్రంలో డిఫెన్స్ ఏరోస్పేస్ రంగాల అభివృద్ధికి కొత్త అవకాశాలు వస్తాయని అధికారిక వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# పోలీసు అధికారుల సేవలు వెలకట్టలేనివి: సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్

**సైబరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:**



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో 30.04.2026 నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఏడు మంది పోలీసు సిబ్బందిని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ, రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భం గా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ యూనిఫాం పోలీస్‌కు రెండో చర్మం లాంటిదని, ప్రజల కన్నీరు తుడిచి, వారికి సేవలు అందించిన ప్రతి పోలీసు అధికారి పదవీ విరమణ సమయంలో గర్వపడాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి తన కుటుంబానికి రుణపడి ఉండాలన్నారు. పోలీసులు విధుల నిర్వహించే క్రమం లో వారి కుటుంబ సభ్యులు ఎన్నో త్యాగాలు చేస్తారని గుర్తు చేశారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, సమాజంలోని పౌరులతో సానుభూతితో, గౌరవంతో మెలగాలని సూచించారు. పదవీ విరమణ చేసిన పోలీసులు తమ అనుభవంతో పోలీస్ శాఖకు అవసరమైనప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ బీ ఏడీసీపీ రవికుమార్ డీసీపీగా ప్రమోషన్ పొందినందుకు సీపీ అభినందనలు తెలిపారు. తన పదవీ విరమణ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు చేరువయ్యేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఒక కానిస్టేబుల్ కుమారుడిగా కెరీర్‌ను ప్రారంభించి, నేడు డీసీపీ స్థాయికి ఎదగడం పట్ల గర్వంగా ఉందన్నారు. పోలీస్ శాఖలో శారీరక శ్రమతో పాటు 'హ్యూమన్ ఇంటెలిజెన్స్' మరియు మేధోపరమైన కృషి ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. తన విజయ ప్రస్థానంలో కుటుంబ సభ్యుల తోడ్పాటు మరవలేనిదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. సైబరాబాద్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో ట్రాఫిక్ 2 డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఎస్‌బీ ఎస్ఐ పి. వెంకట్ రెడ్డి, ఏఆర్ఎస్ఐ కె. మురళీధర్ సంగారెడ్డి జిల్లా అటాచ్‌మెంట్‌తో సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఆర్ఎస్ఐ ఎన్. కృష్ణ సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఎస్ఐ వి. వెంకట సూర్యనారాయణ రాజు ఈఓడబ్ల్యూ సైబరాబాద్‌లో, డి. రాములు మోకిల పోలీస్ స్టేషన్‌లో, అలాగే జి. అశోక్, బార్బర్, సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ తమ పదవీ విరమణ పొందారు. వీరి సేవలను అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తులో ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమం లో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ఎస్‌బి ఏడీసీపీ రవికుమార్, మరియు వివిధ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# బెంగాల్ ఆటవిక పాలన నుండి విముక్తి



- పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్

**విజయవాడ వెలుతురు ఏప్రిల్ 30:**

పశ్చిమ బెంగాల్లో అనేక దశాబ్దాలుగా నెలకొన్న ఆటవిక పాలనకి మే 4వ తారీఖున తెరపడి అభివృద్ధికి నవోద యానికి తెర లేపటం తథ్యం. బెంగాలీ ప్రజలు బలంగా మార్పును కోరుకు న్నారు కాబట్టే నిర్భయంగా బయటికి వచ్చి ఇప్పుడు కాకపోతే మరిప్పుడు అన్నట్లు ఉదయం నుంచే బారులు తేరి తమ ఓటు హక్కు ని వినియోగిం చుకున్నారు. మమత అనే గ్రహణాన్ని ఓటు అని కాగడాతో దహించి ప్రజలు కమలాన్ని వికసింప చేస్తున్నారు అనటంలో ఏ మాత్రం సందేహం అక్క ర్లేదు. దేశంలో ఉన్న మహానగరాలకి సహజంగా ప్రజలు తరలివెళ్లి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వెతుక్కుంటారు. కానీ విచిత్రం ఏంటంటే కోల్కత్తా అన్నది ఒక మహానగరం అయినప్ప టికీ ప్రజలు అక్కడి నుండి తరలివెళ్లి దేశంలో బెంగళూరు, ఢిల్లీ, హైదరాబా ద్ వంటి మహానగరాలలో ఉద్యోగుల కోసం ఉపాధి కోసం వెతుక్కోవలసిన దుస్థితి ఏర్పడింది. దీనికి కారణం తొలిత కాంగ్రెస్ ఆ తర్వాత కమ్యూని స్టులు ఇప్పుడు మమత. విద్యకి విజ్ఞా నానికి ప్రగతికి సాహిత్యానికి ఆలవా లమైన బెంగాల్ భూమిని ఈ మూడు పార్టీలు కలిసి ఒకరి తర్వాత ఒకళ్ళు పోటీపడి మరు భూమిగా మార్చారు. గతంలో ఉత్తరప్రదేశ్ బీహార్ వంటి రాష్ట్రాల్లో ఏ రకంగా మాఫియా సామ్రాజ్యాలు నడిచేయు ఇప్పుడు పశ్చిమ బెంగాల్లో అచ్చం అటువంటి పరిస్థితిలే ఉన్నాయి. పరిశ్రమలు లేవు, వ్యాపారస్తులు ధైర్యంగా వ్యాపారాలు చేసుకునే పరిస్థితి లేదు, హిందువులు తమ పండుగల్ని చేసుకునే స్వేచ్ఛ లేదు, మహిళలు స్వేచ్ఛగా బయటికి వెళ్లి తిరిగి వచ్చే పరిస్థితి ప్రశ్నార్థకం, లంచగొండి పరిపాలన, గల్లి నుంచి పై స్థాయి వరకు టీఎంసీ గుండాల హవా, బంగ్లాదేశ్ నుంచి వచ్చే చొరబాటుదా రులకు పెద్ద పేట, శాంతి భద్రతలు శూన్యం ఇది పశ్చిమబెంగాల్ నేటి పరిస్థితి. ఎన్నికలు వచ్చాయి అంటే చనిపోయిన వ్యక్తులు కూడా సమాధి నుంచి లేచి వచ్చి బెంగాల్లో ఓట్లు వేయటం పరిపాటే. టీఎంసీ గుండాలు ఎన్నికలు ప్రారంభం అయిన కొన్ని గంటల్లోనే చనిపోయిన వ్యక్తుల ఓట్లు వేసేస్తారు అలాగే ఆ ప్రాంతం నుంచి ఎప్పుడో వలస వెళ్లిపోయిన వాళ్ళ ఓట్లు కూడా వేస్తారు దీన్నే అక్కడ ప్రాంతీయ భాషలో "చాప" ఓట్లు అంటారు. ఈ చాప ఓట్లు పునాదుల మీద టీఎంసీ విజయ సౌధాలు కట్టుకోవడం పరి పాటగా మారిపోయింది. రాజ్యాంగబ ద్ధంగా కేంద్ర ఎన్నికల సంఘం సమగ్ర ముమ్మర ఓట్ల సవరణ (SIR) ప్రక్రియ ద్వారా ఇటువంటి ఓట్లన్నీ తొలగించ డం ద్వారా మమతా బెనర్జీకి చాప ఓట్లు వేసుకునే అవకాశం లేకుండా పోయింది. టీఎంసీ గుండాలు లోపల పోలీసులు ప్రభుత్వ ఉద్యోగులు అందరితో మీలాకత్ అయిపోయి టీఎంసీ వ్యతిరేక ఓట్లు పడనివ్వకుం డా వాళ్లని పోలింగ్ బూత్ వరకు రాకుండా నిలువరించి ఆ తరువాత అందరూ కుమ్మక్కై రిగ్గింగ్ చేసుకో వడం వారికి పరిపాటు. ఈ ఎన్నిక ల్లో కేంద్ర ఎన్నికల సంఘం కేంద్ర బలగాల ద్వారా కట్టుదిట్టమైన రక్షణ కల్పించి ఓటర్లలో ధైర్యం నింపి ఎక్కడి కి అక్కడ టీఎంసీ గుండాలను అరెస్టు చేసి స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ అయ్యే విధంగా చూశారు కాబట్టి 93% ఓట్లు నమోదు అవ్వటం అంటే ఆ రాష్ట్రంలో చిన్న విషయం కాదు ఇది ఒక అద్భుతం అని చెప్పాలి ఈ అద్భుతాన్ని ఆవిష్కరించిన కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఎంత మెచ్చుకు న్నా అది తక్కువే. వారు తీసుకున్న చర్యలు ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి ఓట్లు వేసి ప్రజాస్వా మ్యాన్ని గెలిపించారు.

కేంద్ర ఎన్నికల సంఘం ఇన్ని కట్టుదిట్ట మైన చర్యలు తీసుకున్నప్పటికీ మనం కొన్ని పోలింగ్ బూత్లలో EVM మెషిన్ల లో బిజెపి గుర్తు ఉన్న బటన్ వద్ద సీలు వేసేసిన దృశ్యాలు కొన్ని చూసాం. అంటే అక్కడి అధికారులు టిఎంసితో కుమ్మక్కయి బిజెపికి ఓటు పడకుండా చేసిన దుర్మార్గపు చర్య. అదే కేంద్ర ఎన్నికల సంఘం ఇంత కఠిన చర్యలు తీసుకోకుండా ఉంటే ఇంకా ఎంత ఎత్తున ఇటువంటి దుర్మార్గాలు చేసి ఉండేవారు ఒక్కసారి ఆలోచించగ లరు. దేశంలోని కొందరు కుహనా మేధావులు, కొన్ని మీడియా ఛానల్లు భాజపా పాలిత రాష్ట్రాలలో చిన్న తప్పు జరిగితే దేశం మొత్తం గోల గోల చేస్తారే కానీ మమతా బెనర్జీ ప్రభుత్వం లో ఎన్ని అరాచకాలు జరుగుతున్నా కళ్ళున్న కబోదిలా ప్రవర్తించడం దుర దృష్టకరం. బంగ్లాదేశ్ నుండి అక్రమ చొరబాటు దారులని మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రోత్సహిస్తూ వారికి ఆధార్ కార్డులు బ్యాంకు ఖాతాలు ఓటర్ ఐడి కార్డులు ఇవ్వటం ద్వారా దేశ భద్రత కి పెను సవాలుగా మారింది. పచ్చ బొంగాల్లోకి ప్రవేశించిన ఈ అక్రమ వలసదారులు దేశంలో వివిధ రాష్ట్రా లలోకి చేరిపోయి భారతీయుల ఉద్యోగ ఉపాధి అవకాశాలకు గండి కొట్టడం తో పాటు అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటూ దేశ భద్రతకి సవాలుగా మారుతున్నారు. నేడు బెంగాలీ ప్రజలు మమతపై చేస్తున్న తిరుగుబాటు వారి ఉనికి సంస్కృతి పరిరక్షణ కోసమే కాదు దేశ రక్షణ కోసం కూడా అని మనం గుర్తుపెట్టుకోవాలి. మే నాల్గవ తారీకు పశ్చిమ బెంగాల్లో కమల వికాసంతో ఆ రాష్ట్ర భవిష్యత్తు కాదు దేశ భవిష్యత్తు కూడా మారనున్నది.

# మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌లోకి డబ్బులు

- మంగ్లీ మైక్రోఫైనాన్స్ మోసం కేసులో కీలక పరిణామం
- పరిశీలనలో మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ బ్యాంకు ఖాతాలు
- నిందితుడు రమావత్ మధు ఖాతా నుంచి మూడు సార్లు డబ్బు బదిలీ
- రమావత్ మధు బ్యాంకు ఖాతాలు జప్తు
- మధు, హిమకాంత్ రెడ్డి, శివ చౌహాన్ ఖాతా వివరాలు కోరిన పోలీసులు
- మైక్రోఫైనాన్స్ పేరిట అధిక లాభాల ఆశ చూపి మోసం
- న్యాయవాది సుబ్బారావు ఫిర్యాదుతో మంగ్లీపై కేసు



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:**

ప్రముఖ గాయని మంగ్లీ పేరు ముడిపడి ఉన్న మైక్రోఫైనాన్స్ మోసం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలించగా, రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి శివ చౌహాన్ ఖాతాకు మూడు సార్లు డబ్బు వచ్చినట్లు గుర్తించారు. ఈ క్రమంలో రమావత్ మధు బ్యాంకు ఖాతాలను పోలీసులు జప్తు చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో భాగంగా మధు, హిమకాంత్ రెడ్డి, శివ చౌహాన్‌ల బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వా లని సంబంధిత బ్యాంకులకు పోలీసులు లేఖలు రాశారు. ఈ లావాదేవీలు కేసు దర్యాప్తును మరింత ముందుకు తీసుకె ళ్లడంలో సహాయకరంగా ఉంటాయని పోలీస్ వర్గాలు తెలిపాయి.

**మోసం ఆరోపణలు ఎలా మొదల-య్యాయి?**

మైక్రోఫైనాన్స్ పథకాల పేరిట అధిక లాభాలు ఇస్తామని నమ్మబలికి రూ.కో ట్లలో మోసం చేశారని హిమకాంత్ రెడ్డి తదితరులు సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావును సంప్రదిం చారు. ఈ విషయం తెలుసుకోవడానికి సుబ్బారావు మంగ్లీని సంప్రదించగా, ఆమె బెదిరింపులకు పాల్పడ్డారని ఆయన పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గాయని మంగ్లీ, ఆమె సోదరుడు శివ చౌహాన్‌తో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొత్తం రూ.10 కోట్ల నుంచి వందల కోట్ల వరకు మోసం జరిగినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అయితే మంగ్లీ తనపై వచ్చిన ఆరోపణ లను ఖండించారు. మైక్రోఫైనాన్స్ వ్యవ హారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తాను కూడా బాధితురాలినేనని ఆమె స్పష్టం చేశారు. న్యాయవాది సుబ్బా రావు తనపై దుష్ప్రచారం చేసి ప్రాచుర్యం పొందాలని చూస్తున్నారని ఆరోపించి, ఆయనపైనే పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**పోలీస్ దర్యాప్తు కొనసాగుతోంది**

ప్రస్తుతం పోలీసులు బ్యాంకు లావాదేవీ లు, ఫోన్ కాల్స్, చాట్స్, డాక్యుమెంట్లు సమగ్రంగా పరిశీలిస్తున్నారు. రమావత్ మధు ఖాతా నుంచి శివ చౌహాన్ ఖాతాకు జరిగిన డబ్బు బదిలీలు కేసులో కీలకమ ని పోలీసులు భావిస్తున్నారు. మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కేసు గ్రామీణ, నగర ప్రాంతా ల్లోని అనేక మంది బాధితులను ప్రభావి తం చేసినట్లు తెలుస్తోంది. బాధితులు మైక్రోఫైనాన్స్, ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్ పథకాల పేరిట అధిక లాభాలు ఇస్తామ ని నమ్మి లక్షలు, కోట్లు ఇచ్చినట్లు ఫిర్యా దులు చేశారు. పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకొని సమగ్ర దర్యాప్తు చేపట్టారు. మరిన్ని ఆరోపితులు, బ్యాంకు వివరాలు, డబ్బు మార్గాలు గుర్తించడాని కి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# ఆకస్మికంగా మరణించిన మారబోయిన మధుసూదన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- నేడు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మిర్యాలగూడ రాక సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ విజ్ఞప్తి

**మిర్యాలగూడ ఏప్రిల్, 30 (వెలుతురు న్యూస్ ):**

తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిపిఆర్ఓ మారబోయిన మధుసూదన్ కుటుంబాన్ని ఆదుకోవా లనీ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ విజ్ఞప్తి చేశారు.రేపు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మి ర్యాలగూడలో మధుసూదన్ కుటుంబ సభ్యులను పరామర్శించుటకు వస్తున్న సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. అనేక సంవత్సరాలు జర్నలిజంలో పనిచేసి అందరి కష్టాలలో తోడు నీడగా ఉండే మధుసూదన్ హార్ట్ స్ట్రోక్ తో అకాల మరణం చెందడం చాలా బాధాకరమని అన్నారు.




# పవన్ ఖేరా ముందస్తు బెయిల్‌పై సుప్రీంకోర్టు విచారణ



- అస్సాం సీఎం భార్యపై చేసిన వ్యాఖ్యలతో నమోదైన కేసులో న్యాయపోరాటం
- - గువాహటి హైకోర్టు బెయిల్ తిరస్కరణ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఖేరా
- - విచారణలో కస్టడీ అవసరం లేదని ఖేరా తరపు న్యాయవాదుల వాదన
- - ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమన్న న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ
- - పాస్‌పోర్టు కాపీలు నకిలీగా చూపారని అస్సాం పోలీసుల ఆరోపణలు
- - పరారీలో ఉన్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు నివేదిక
- - ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు.. తీర్పు రిజర్వ్
- - పరువు నష్టం కేసులో అరెస్టు అవసరమా అన్న అంశంపై చర్చ
- - రాజకీయ వివాదంగా మారిన కేసు న్యాయస్థానంలో విచారణ

**అస్సాం వెలుతురు ఏప్రిల్ 30:**

అస్సాం ముఖ్యమంత్రి భార్యపై చేసిన వ్యాఖ్యలతో నమోదైన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత పవన్ ఖేరా దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటి షన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ కేసు అస్సాం రాజకీయ వర్గాల్లోనే కాక జాతీయ స్థాయిలోనూ చర్చనీయాంశంగా మారింది. పవన్ ఖేరా అస్సాం ముఖ్యమంత్రి భార్య రిణికి భూయాన్ శర్మపై పలు పాస్‌పోర్టులు ఉన్నాయని, విదేశీ ఆస్తులు ఉన్నాయని ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేసు నమోదు అయింది. ఈ ఆరోపణలపై గువాహటిలో కేసు నమోదు కావడంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం గువాహటి హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ బెయిల్ తిరస్కరించారు. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా ఖేరా తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఈ కేసులో కస్టడీ అవసరం లేదని ఆయన కోర్టుకు తెలిపారు. ఇది పూర్తిగా పరువు నష్టం కేసు మాత్రమేనని, అరెస్టు చేయా ల్సిన అవసరం లేకుండానే విచారణ కొనసాగించవచ్చని వాదించారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మపై కూడా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చట్టాలకు అతీతంగా వ్యవహ రిస్తున్నారన్న భావన కలిగేలా ప్రభుత్వం ప్రవర్తిస్తోందని, రాజకీయ ఒత్తిడితోనే అరెస్టు సన్నాహాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇక అస్సాం పోలీసుల తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఖేరా చూపించిన పాస్‌పోర్టు కాపీలు నకిలీగా ఉన్నాయని, వాస్తవాలను వక్రీకరించార ని ఆయన కోర్టుకు తెలిపారు. ముఖ్యమం త్రి భార్యపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేశారని ఆరోపించారు. అంతేకాక పవన్ ఖేరా ప్రస్తుతం పరారీలో ఉన్నార ని, సోషల్ మీడియా వీడియోల ద్వారా వ్యాఖ్యలు చేస్తూ విచారణను ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారని కూడా ఆయన పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. పరువు నష్టం కేసుల్లో అరెస్టు అవసరమా లేదా అనే అంశం కూడా మళ్లీ తెరపైకి వచ్చింది. తదుపరి తీర్పుపై ఇప్పుడు అందరి దృష్టి సుప్రీంకోర్టుపైనే నిలిచింది.



# విద్యతో సమాజ మార్పు సాధ్యం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడి
- నల్గొండలో రూ.200 కోట్ల యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన

**నల్లగొండ వెలుతురు ఏప్రిల్ 30:**

రాష్ట్రంలో విద్య, ఆరోగ్యం, సాగునీటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం కోల్ముంతల్ పహాడ్ గ్రామ పరిధిలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, సమాజంలో స్థిరమైన మార్పు రావాలంటే విద్యే ప్రధాన ఆయుధమని చెప్పారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత ప్రమాణాల విద్య అందించేందుకు ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ విద్యాసంస్థ ఆధునిక వసతులతో, సమగ్ర విద్యా విధానంతో రూపుదిద్దుకుంటుందని మంత్రి వివరించారు. విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాల్లో కూడా శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు నగర స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని విభాగాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని మంత్రి పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, సాగునీరు, మౌలిక వసతుల రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆరోగ్య రంగంపై మాట్లాడుతూ, దేవరకొండ ప్రాంతానికి ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) విధానం ద్వారా వైద్య చికిత్సలకు అవసరమైన ఆమోదాలను 24 గంటల్లోనే మంజూరు చేస్తున్నామని తెలిపారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. సాగునీటి ప్రాజెక్టుల ప్రాముఖ్యతను కూడా మంత్రి ప్రస్తావించారు. ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) సొరంగం నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేవరకొండ, మునుగోడు మండలాలకు సాగునీటి వసతి కల్పించి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం ప్రభుత్వానికి ప్రాధాన్యతగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. సాగునీటి సౌకర్యాలు మెరుగుపడితే వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని, రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయడం అవసరమని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, విద్యా విస్తరణ, ఆరోగ్య సేవల మెరుగుదల చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ ప్రాంతంలోని విద్యార్థులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా మౌలిక వసతులు పెరగడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి అవకాశాలు కలుగుతాయని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం విద్యా రంగానికి ఇచ్చే ప్రాధాన్యత మరోసారి స్పష్టమైంది. పేదలకు నాణ్యమైన విద్య అందించడమే కాకుండా, సమాజంలో సమానత్వాన్ని తీసుకురావడంలో కూడా ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషించనుంది. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా ప్రజలు ముందుకు రావాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# అమరావతిలో భారీగా మౌలిక వసతుల కల్పన

- వేల ఉద్యోగాల భర్తీ,
- కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు
- అమరావతిలో ఐకానిక్ కట్టడాలు
- వేల కోట్ల నిధుల కేటాయింపు
- రాష్ట్రవ్యాప్త మున్సిపాలిటీల్లో మ్యూటేషన్ ఛార్జీల ఏకీకరణ
- ఉద్యోగాల జాతర.. కొత్త పోస్టుల సృష్టికి ఆమోదం
- పోలీసు శాఖలో పదోన్నతులు
- 385 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్
- రామాయపట్నం పోర్ట్ అభివృద్ధి.. రూ. 354 కోట్ల అనుమతులు
- రైతులకు తీపి కబురు.. కౌలు పెంపు, పెన్షన్ నిబంధనల సవరణ
- వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు.. పారిశ్రామిక వేత్తలకు స్టాంప్ డ్యూటీ మినహాయింపు
- ఢిల్లీలో కొత్త ఏపీ భవన్.. రూ.124.50 కోట్లతో రాజధానిలో నిర్మాణం

**అమరావతి వెలుతురు ఏప్రిల్ 30:**






ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో కీలక సమావేశాన్ని నిర్వహించింది. రాష్ట్ర అభివృద్ధికి దిక్సూచిగా నిలిచేలా సుమారు 20కి పైగా ప్రధాన అజెండా అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిపి, పలు చారిత్రాత్మక నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయ మార్కెటింగ్ రంగం బలోపేతం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. మున్సిపల్ ఆస్తుల లీజు సవరణల నుంచి మొదలుకొని ఢిల్లీలో కొత్త ఏపీ భవన్ నిర్మాణం వరకు కేబినెట్ పలు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అమరావతి రాజధాని పనులను పరుగులు పెట్టించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణానికి ఏకంగా రూ. 1208.41 కోట్ల నిధులను కేటాయించింది. సచివాలయం, జీఏడీ, విభాగాధిపతుల (హెచ్ఓడీ) టవర్లకు సంబంధించిన ఫాసేడ్, గ్లేజింగ్ పనుల కోసం రూ. 2540 కోట్లను మంజూరు చేసింది. అలాగే రాష్ట్ర శాసనసభ భవనంలో పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులకు రూ. 798 కోట్లు ఖర్చు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజధాని ప్రాంతంలో 220 కేవీ విద్యుత్ లైన్ల రీరూటింగ్ కోసం రూ. 1180.54 కోట్లు కేటాయించి, అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే పనులను వేగవంతం చేయాలని నిర్ణయించింది.

**పోలీసుల పదోన్నతులు.. కొత్త కొలువుల సృష్టి**

రాష్ట్రంలో నిరుద్యోగులకు మరియు ప్రభుత్వ ఉద్యోగులకు కేబినెట్ శుభవార్త చెప్పింది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 2000 బ్యాచ్‌కు చెందిన 385 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించాలని నిర్ణయించింది. అలాగే న్యాయ వ్యవస్థను బలోపేతం చేస్తూ హైకోర్టు మరియు జిల్లా కోర్టుల్లో 21 కోర్ట్ మేనేజర్ పోస్టుల సృష్టికి ఆమోదం తెలిపింది. ఏపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో మరో 20 కొత్త పోస్టులను (6 రెగ్యులర్, 14 అవుట్‌సోర్సింగ్) మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీస్ మేనేజర్ పోస్టును సెక్షన్ ఆఫీసర్‌గా అప్‌గ్రేడ్ చేసింది.

**మున్సిపల్ సంస్కరణలు.. మ్యూటేషన్ ఛార్జీల మార్పు**

మున్సిపాలిటీలకు చెందిన ఆస్తుల లీజు రెన్యూవల్ మరియు అద్దె నిర్ణయ విధానాల్లో కీలక సవరణలకు కేబినెట్ అంగీకారం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యూటేషన్ ఛార్జీలు (ఆస్తి బదలాయింపు రుసుము) ఒకే విధంగా ఉండేలా చట్ట సవరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. దీనివల్ల సామాన్యులకు ఇబ్బందులు తొలగడమే కాకుండా రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**రైతు సంక్షేమం - కౌలు పెంపు**

రాజధాని ప్రాంతంలోని రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంది. 2వ దశ ఎల్పీఎస్ గ్రామాల్లో రైతులకు యాన్యుటీ, పెన్షన్ మంజూరు నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. మెట్ట భూములకు ఎకరాకు ఇచ్చే కౌలును రూ. 40 వేలకు, జరీబు భూములకు రూ. 60 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా, ప్రతి ఏటా మెట్ట భూములకు రూ. 3 వేలు, జరీబు భూములకు రూ. 5 వేల చొప్పున పదేళ్ల పాటు కౌలు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. మార్క్‌ఫెడ్ బలోపేతానికి రూ. 1800 కోట్ల రుణానికి **ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చింది.**

మౌలిక వసతులు.. పారిశ్రామికాభివృద్ధి

ప్రకాశం జిల్లా రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ పనుల కోసం రూ. 354 కోట్ల నిధులను మంజూరు చేసిన ప్రభుత్వం, కృష్ణా నది తీర రక్షణ పనుల కోసం రూ. 443.26 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమైంది. నెల్లూరు, కాకినాడ, కర్నూలు, కడప ప్రాంతాల్లో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ప్రాజెక్ట్ విలువపై 2 శాతం స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇచ్చింది. ఢిల్లీలో 11.5 ఎకరాల విస్తీర్ణంలో రూ. 124.50 కోట్లతో అత్యాధునిక ఏపీ భవన్‌ను నిర్మించాలని నిర్ణయించి, దానికి అవసరమైన పోస్టులను కూడా మంజూరు చేసింది. చివరగా, రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేలా వివిధ సంస్థలకు భూములను కేటాయించే ప్రతిపాదనలకు మంత్రివర్గం సానుకూలంగా స్పందించింది. జలవనరులు, రెవెన్యూ, రవాణా శాఖల్లో సేవలను మరింత మెరుగుపరిచేందుకు వీలుగా పరిపాలనా అనుమతులను మంజూరు చేస్తూ ఏపీ ప్రభుత్వం ప్రగతి పథంలో మరో అడుగు ముందుకు వేసింది.

# కోహెడలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై కట్టుదిట్ట పర్యవేక్షణ

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- కోహెడ మండలంలోనీ అన్ని గ్రామాల్లో టార్గెట్ గా పెట్టుకొని ఆయిల్ ఫాం సాగు పెంచాలి





**కోహెడ వెలుతురు ఏప్రిల్ 30:**

సిద్దిపేట జిల్లా కోహెడ మండల కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సంబధిత అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో కోహెడ మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ లో రైతులకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలు,వేసవి లో తాగునీటి సరఫరా లో ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు , ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, బడిబాట కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సంఖ్య పెంచడం,వర్షకాలంలో వన మహోత్సవం ద్వారా ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటెల చర్యలు తీసుకోవడం ఇతర అభివృద్ధి కార్యక్రమాల పై అధికారులతో సమీక్షా చేశారు సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కోహెడ మండలంలో 26 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా 16 ఐకేపీ ,10 పీఏసిఎస్ నిర్వహిస్తున్నాయని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిన్నటి వరకు ఆన్లైన్ ద్వారా ధాన్యం కొనుగోలు లో ఇబ్బందులు తలెత్తాయని ఇప్పుడు మళ్ళీ పాత పద్దతిలో ఆఫ్ లైన్ లోకి మార్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రైతులు తాలు పడుతున్న అధికారులు ఇబ్బందులు పెట్టద్దన్నారు. ధాన్యం కొనుగోలు లో మే 2 వ తేదీ లోపు సమస్యలు పరిష్కారం కావాలని అధికారులు సమన్వయం చేసుకొని పని చేయాలని ఆదేశించారు. రైతులకు టర్పాలిన్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద లారీ ల సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కోహెడ మండలంలో వేసవి కాలంలో తాగునీటి సరఫరా లో సమస్యలు రాకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుండారెడ్డి పల్లి, ఎర్రగుంట్ల పల్లి లో వస్తున్న డ్రింకింగ్ వాటర్ సమస్య తక్షణమే పరిష్కరించాలని సూచించారు. శనిగరం పైప్ లైన్ సమస్య తొలగించాలని , కూరెళ్ళలో ఎస్సీ కాలనిలో వాటర్ సమస్య తొలగించాలని ఆదేశించారు. పలు గ్రామాల్లో బోర్ వెల్ అడుగుతున్నారు. దాని ద్వారా గ్రామ పంచాయతీ విద్యుత్ బిల్లులు సమస్య ఎదురవుతుంది. డ్రింకింగ్ వాటర్ సమస్యల్లో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పాత బావులు పూడికతీత చేసి ఉపయోగించుకోవాలని సూచించారు. నీటి వనరులు ఉన్న బావుల నుండి పైప్ లైన్ ద్వారా నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య పై సమన్వయం చేసుకోవడానికి ఐదుగురు సభ్యుల కమిటీ వేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు సమస్య ఉన్న, తాగు నీటి సమస్యలు ఉన్న నాకేంటి అని ఏ అధికారి నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కోహెడ మండలంలో 506 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవగా 445 గ్రౌండింగ్ అయ్యాయని 65 మంది ఆసక్తి లేని వారికి నోటీసులు ఇచ్చి క్యాన్సల్ చేయడం జరిగిందన్నారు.ఇప్పటి వరకు 76 ఇల్లు పూర్తయ్యాయనీ, జూన్ వరకు మొత్తం మొదటి విడత ఇల్లు పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరపాలని అధికారులను ఆదేశించారు. కోహెడ లో 335 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతుందని వచ్చే ఏడాది లో ఆయిల్ ఫామ్ సాగు టార్గెట్ పెట్టుకొని ఒక్కో సర్పంచ్ 50 ఎకరాలు రైతులకు అవగాహన కల్పించి ఆయిల్ ఫామ్ సాగు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నర్మేట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కోహెడ మండలానికి దగ్గర ఉన్నందున ట్రాన్స్పోర్ట్ ఇబ్బందులు లేకుండా ఆయిల్ ఫాం సాగు ద్వారా అధిక లాభాలుంటాయన్నారు.బడి బాట ద్వారా ఇంటింటికి తిరిగి పిల్లలు చేరేలా చర్యలు తీసుకోవాలనీ, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచాలనీ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కోహెడ మండలంలో అన్ని పాఠశాలలకు పెయింట్స్ వేయడంతో పాటు, మౌలిక సదుపాయాలు బెంచ్ లు ,వాష్ రూమ్స్ ఏర్పాటు చేయడానికి ప్రపోజల్ ఇవ్వాలని ప్రత్యేక సిఎస్సార్ ఫండ్స్ ద్వారా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మండలంలో 42 ప్రభుత్వ పాఠశాలల్లో 2706 మంది విద్యార్థులున్నారని టీచర్ స్టూడెంట్ నిష్పత్తి రేషియో తక్కువగా ఉందని విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో కమిటీ వేశామని వారు విద్యార్థుల తల్లిదండ్రులను మోటివేట్ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని ఏ ఇల్లు అయితే ఉన్నత చదువులు చదివిన కుటుంబాలు ఉన్నాయో ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎదిగినట్లు సిప్ సర్వేలో తేలిందన్నారు. కోహెడ మండలంలో ఆర్విఎం మెడికల్ కాలేజీ ద్వారా గ్రామాల్లో మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేస్తున్నామని ప్రతి వ్యక్తి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు.

# విత్తన కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష

- నాణ్యమైన విత్తనాలనే రైతులకు అందుబాటులో ఉంచాలి - మంత్రి తుమ్మల
- - నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి - మంత్రి తుమ్మల



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30 :** గురువారం రోజున సచివాలయంలో వ్యవసాయశాఖ, సీడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ మరియు విత్తన కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. వానాకాలం (ఖరీఫ్) 2026 సాగు సన్నాహకంలో భాగంగా, వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాల లభ్యతను కంపెనీల వారీగా, పంటల వారీగా సమీక్షించారు. రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలే అందుబాటులో ఉంచాలని మంత్రి స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వానాకాలం 2026లో రాష్ట్రంలో సుమారు 134.66 లక్షల ఎకరాల్లో సాగు జరిగే అవకాశముండగా, దానికి 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా. ప్రస్తుతం రాష్ట్రంలో 38.21 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరానికి దాదాపు రెండింతలు నిల్వలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. పత్తి సాగు విషయంలో సుమారు 52 లక్షల ఎకరాల లక్ష్యంతో, రైతులకు అవసరమైన 104 లక్షల ప్యాకెట్లకు బదులుగా 212.11 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. గత సంవత్సరం వినియోగంతో పోలిస్తే ఈ సంవత్సరం అధిక నిల్వలు రైతులకు విశ్వాసాన్ని కలిగిస్తాయని మంత్రి పేర్కొన్నారు. హైబ్రిడ్ విత్తనాల లభ్యతపై ప్రత్యేకంగా చర్చిస్తూ, రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న విత్తనాలను ప్రాధాన్యంగా సరఫరా చేయాలని మంత్రి సూచించారు. విత్తనాల నాణ్యతపై ఎలాంటి రాజీ పడకూడదని, సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. నాణ్యత లేని విత్తనాల తయారీ, విక్రయాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గతంలో సబ్‌స్టాండర్డ్ విత్తనాలపై కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రతి నెలాఖరులో కంపెనీలు తమ స్టాక్ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని, సెల్ఫ్ సర్టిఫైడ్ విత్తనాల వల్ల నష్టం కలిగితే కంపెనీలే భరించాలని సూచించారు. వరి సన్నరకాల ఎంపికలో రైతులు, మిల్లర్లు, వినియోగదారుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, అంతర్జాతీయ ఎగుమతి ప్రమాణాలకు అనుగుణంగా ఎంపిక చేయాలని మంత్రి సూచించారు. కంపెనీలు తమ విత్తనాల స్టాక్‌ను మే 15 నుండి రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నకిలీ విత్తనాల నిఘా గురించి మంత్రి మాట్లాడుతూ, జిల్లా నుండి మండల స్థాయివరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి, అక్రమ నిల్వలు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా లూస్ కాటన్ విత్తనాల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దుల్లో కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విత్తనాల సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు లైసెన్సింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని మంత్రి పేర్కొన్నారు. GOT ఫెయిల్ అయిన పత్తి విత్తనాలను పూర్తిగా వినియోగానికి అనర్హంగా ప్రకటించి రైతులకు చేరకుండా నిరోధించాలని ఆదేశించారు. అదేవిధంగా కో మార్కెటింగ్ విధానంలో ఏ కంపెనీ విత్తనాన్ని, ఏ కంపెనీ, ఏ పేరుతో అమ్ముతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని, సీడ్ యాక్ట్ లో ఉన్న కొన్ని లోపాలను కంపెనీలు అవకాశంగా మార్చుకొని రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలను తమ ప్రభుత్వం ఉపేక్షించదని తెలిపారు. అవసరమైతే కో మార్కెటింగ్ పూర్తి రద్దుచేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మట్టిసారాన్ని పెంపొందించే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. వానాకాలం 2026లో 1.95 లక్షల క్వింటాళ్ల పంపిణీకి రూ.134 కోట్లు వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు. ఖరీఫ్ నాట్లకు ముందే అన్ని విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యతపై రాజీ లేకుండా, నకిలీ విత్తనాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని మంత్రి తుమ్మల గారు స్పష్టం చేశారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, విత్తన కంపెనీలతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం, మరియు నకిలీ విత్తనాల నిర్మూలన కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడ్ కార్పోరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి మరియు వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇదే రోజు సచివాలయంలో డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ప్రతినిధులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రైతులకు వాతావరణ పరిస్థితులపై సమయానుకూల సలహాలు అందించే కార్యక్రమాలను వివరించారు. ఒడిశా, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో పైలట్ ప్రాజెక్ట్‌గా తమ సంస్థ స్వతంత్రంగా పనిచేస్తోందని, రైతులకు సాగుకు ముందుగానే వాతావరణ పరిస్థితులు, వర్షపాతం వివరాలను SMS మరియు WhatsApp ద్వారా చేరవేస్తున్నామని తెలిపారు. ఈ సమాచారంతో రైతులు నాట్లు వేయాల్సిన సమయం, పంట కోతలు చేపట్టాల్సిన సమయం, మార్కెట్లో అమ్మకానికి అనుకూల సమయాన్ని ముందుగానే ని ర్ణ యిం చు కో గ లు గు తు న్నా ర ని వివరించారు. అకాల వర్షాలు, తుఫానులు, గాలిదుమారాలు వంటి విపరీత వాతావరణ పరిస్థితుల వల్ల కలిగే పంట నష్టాన్ని తగ్గించేందుకు ఈ విధానం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ అమలుకు ప్రభుత్వ సహకారం అందించాలని ప్రతినిధులు మంత్రిని కోరగా, దీనిపై సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను మంత్రి ఆదేశించారు.

# మే చివరి నాటికి '2 బిహెచ్ కె' ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలి

- **ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ లేదు**
- **సరిహద్దు వివాదాలకు స్వస్తి పలకాలి**
- **రెవెన్యూ, ఫారెస్టు జాయింట్ సర్వే**
- **ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష**

హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 30:




రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు ఏస్థాయిలో కూడా ఉన్నా కూడా మే నెల చివరి నాటికి లబ్ధిదారుల ను గుర్తించి కేటాయించాలని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారుల ను ఆదేశించారు. నిర్మాణ పనులు చివరి దశలో ఉన్న ఇండ్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అంసపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేయడానికి ఇంతవరకు ఖర్చు చేసిన మొత్తాన్ని మినహాయించి , తదుపరి అవసరమైన వ్యయాన్ని ఐదు లక్షల లోపు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందచేస్తామని వెల్లడించారు. అసంపూర్తిగా ఉన్న 2 బిహెచ్ కె లను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో లబ్దిదారులే నిర్మించుకునేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ ఇండ్ల నిర్మాణాలకు గ్రీన్ ఛానల్ లో నిధులు విడుదల చేస్తామన్నారు.

గురువారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో హౌసింగ్ రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో రెవెన్యూ,హౌసింగ్ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ, కరీంనగర్ ఇన్ ఛార్జి మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, ఐటిపరిశ్రమల శాఖ మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు, ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీ హెచ్. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేయాలని , విద్యుత్, మంచినీటి, డ్రైనేజి , రోడ్లు వంటి కనీస వసతులు కల్పించాలని చాలా ఇండ్లలో అనర్హులు ఉన్నారని, వారిని తొలగించి అర్హులకు ఇవ్వాలని సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై మంత్రిగారు స్పందిస్తూ తక్షణమే అనర్హులను తొలగించే చర్యలు చేపట్టాలని, అర్హులకు కేటాయించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందులో ఎమ్మెల్యేలను భాగస్వామ్యులను చేయాలని సూచించారు. 400 కోట్ల రూపాయలతో 2 బిహెచ్ కె కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు తీసుకుని అక్కడ నివసించని వారి ఇండ్లను రద్దు చేసి, అర్హులైన ఇతరులకు వాటిని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నారు

2 బిహెచ్ కె బిల్లుల చెల్లింపుల్లో, అక్రమాలకు పాల్పడితే సస్పెండ్ తో సరిపెట్టనని సర్వీసు నుంచి తొలగించడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు.

గౌరవముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా పేదవారి సొంత ఇంటి కలను నిజం చేసేలా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదే అని, ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 దరఖాస్తు ఇప్పుడు చేశారు, అప్పుడు చేశారనేది ముఖ్యం కాదనీ పేదరికమే అర్హతని, అర్హులైన వారికి ఇండ్లను ఇవ్వడమే కలెక్టర్ల బాధ్యత అని అన్నారు. మొదటి విడతలో వివిధ కారణాలతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోని వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు.

పేదవాడికి సహాయం అందించాలన్న సదుద్దేశ్యంతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఇంటి నిర్మాణానికి అవసరమైన 40 టన్నుల ఇసుకను ఉచితంగా అందచేస్తున్నారని తెలిపారు. అయితే లబ్దిదారుల ముసుగులో అక్కడక్కడా దుర్వినియోగం అవుతున్నదన్న సమాచారం ఉన్నదని , ఈ నేపథ్యంలో అర్హులకు ఇసుక అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్రమాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఆచరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై ఒక పాలసీని రూపొందించాలని సూచించారు నగరానికి దూరంగా 2బిహెచ్ కె కాలనీలను నిర్మించడం వల్ల లబ్ధిదారులు అక్కడ నివసించడానికి ఇష్టపడటం లేదని, అక్కడ నివసిస్తే తమ జీవనోపాధికి ఇబ్బందికి కలుగుతుందని లబ్ధిదారులు వెళ్లడం లేదు. తీసుకున్న ఇండ్లను అద్దెకి ఇచ్చి నగరంలోనే ఉంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి, వారి స్థానంలో, ఆయా కాలనీలకు సమీపంలో నివసించే వారికి కేటాయించలన్న ఆలోచన చేస్తున్నాము. దీనిపై ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టాము.

**ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ లేదు**

ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి పడబోమని మంత్రిగారు స్పష్టం చేశారు. భూములను ఆక్రమణలను కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్టు భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని మంత్రి గారు పేర్కొన్నారు. ఇందుకోసం రెవెన్యూ, ఫారెస్టు విభాగాలు జాయింట్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ సర్వేలను శాస్త్రీయ పద్ధతుల్లో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిర్వహించి భూముల స్పష్టమైన సరిహద్దులను గుర్తించాలని సూచించారు. దీని ద్వారా భవిష్యత్తుల్లో వివాదాలకు తెరపడుతుందన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్ మెంట్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. భూ రికార్డుల్లో పాదర్శకత, ఖచ్చితత్వం తీసుకుని రావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొత్తగా రెవెన్యూ డివిజన్లను మండలాలను ఏర్పాటు చేసే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఎక్కడా కలపడం కానీ, తీసివేయడం గానీ లేదని తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో నియోజకవర్గ కేంద్రాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని, అలాగే ఎమ్మార్వో ఆర్డీవో కార్యాలయాలు కూడా నిర్మిస్తున్నామని వీటికి అవసరమైన ప్రతిపాదనలను పంపాలని కలెక్టర్లకు సూచించారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలా ప్రతిష్టాత్మకమైనది, ఈ పథకం చాలా అద్భుతంగా అమలు అవుతున్నది దీనిపై కలెక్టర్లు మరింత ఫోకస్ పెట్టాలని సూచించారు. మంజూరైన ప్రతి ఇల్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలన్నీ పరిష్కారమయ్యే విధంగా క్షేత్ర స్థాయిలో అధికారులు కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలన్నారు.

ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి శ్రీ డిఎస్ లోకేష్ కుమార్, హౌసింగ్ కార్యదర్శి శ్రీ విపి గౌతం తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ప్రారంభం**

హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో 30 కెవి ఉత్పాదన సామర్థ్యంతో నెలకొల్పిన సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ప్లాంట్ ను గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. దీని ద్వారా నెలకు సుమారు 4500 యూనిట్ల మేర విద్యుత్ ను ఉత్పత్తి చేయవచ్చు. హౌసింగ్ కార్పొరేషన్ భవనంలో వినియోగించే విద్యుత్ లో ఈ మేరకు ఆదా అవుతుందని ఎండి శ్రీ విపి గౌతం తెలిపారు.

# కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 30:

దేశంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీ) నడుం బిగించింది. మే 4న జరగనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద అసాధారణ భద్రతా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. ప్రధానంగా అనధికార వ్యక్తుల ప్రవేశానికి చెక్ పెట్టేందుకు ఈసారి 'క్యూఆర్ కోడ్' ఆధారిత గుర్తింపు వ్యవస్థను ప్రవేశపెడుతోంది. భవిష్యత్తులో జరగబోయే అన్ని లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ఇదే ప్రామాణికం కానుందని ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది.



**మూడు అంచెల భద్రత.. ఎలా ఉంటుందంటే?**

కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ప్రతి వ్యక్తిని నిశితంగా తనిఖీ చేసేందుకు ఈసీ సరికొత్త విధానాన్ని రూపొందించింది. మొదటి రెండు చెక్ పాయింట్ల వద్ద భద్రతా సిబ్బంది రిటర్నింగ్ ఆఫీసర్ (RO) జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశించే చివరి మరియు మూడవ వలయం వద్ద క్యూఆర్ కోడ్ స్కానింగ్ ఉంటుంది. ఈ స్కానింగ్ ప్రక్రియ పూర్తయి, గుర్తింపు ధృవీకరణ పొందిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది, రిటర్నింగ్ అధికారులు మరియు సాంకేతిక నిపుణులకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని ఈసీ పేర్కొంది.

**మీడియాకు ప్రత్యేక సౌకర్యాలు**

ఓట్ల లెక్కింపు అప్‌డేట్లను ప్రజలకు వేగంగా చేరవేసేందుకు మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈసీ తెలిపింది. గుర్తింపు పొందిన జర్నలిస్టులకు ఈసీ జారీ చేసిన అధికార పత్రాల ద్వారానే ప్రవేశం ఉంటుంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద మీడియా సౌలభ్యం కోసం ప్రత్యేక 'మీడియా సెంటర్లు' ఏర్పాటు చేయనున్నారు. అయితే, కౌంటింగ్ హాల్‌లోకి మాత్రం నిబంధనల ప్రకారమే పరిమిత ప్రవేశం ఉంటుందని స్పష్టం చేసింది.

**బంగాల్‌లో రికార్డు స్థాయి పోలింగ్**

పశ్చిమ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు చరిత్ర సృష్టించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక పోలింగ్ శాతం నమోదైనట్లు ఈసీ వెల్లడించింది. మొదటి దశలో 93.19 శాతం, రెండో దశలో 91.66 శాతం ఓటింగ్ నమోదైంది. గతంలో 2011లో నమోదైన 84.72 శాతమే అత్యధికం కాగా, ఈసారి ఓటర్లు ఆ రికార్డును తిరగరాశారు. ఎండలను, ఇతర సవాళ్లను లెక్క చేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి రావడంపై ఈసీ హర్షం వ్యక్తం చేసింది.

**విధుల్లో అలసత్వంపై కఠిన చర్యలు**

బంగాల్ ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించలేదనే ఫిర్యాదులపై ఈసీ సీరియస్ అయింది. డైమండ్ హార్బర్ ప్రాంతానికి చెందిన ఐదుగురు పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల విధుల్లో పోలీసుల తీరుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించింది.

**మే 4న వెలువడనున్న తీర్పు**

అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్ మరియు పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఇప్పటికే పోలింగ్ ముగిసింది. వీటన్నింటికీ సంబంధించి మే 4న కౌంటింగ్ జరగనుంది. ఈ లోపు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసిన ఈసీ, కౌంటింగ్ రోజున కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎన్నికల అధికారులను అప్రమత్తం చేసింది. కొత్త క్యూఆర్ కోడ్ విధానం వల్ల కౌంటింగ్ ప్రక్రియ మరింత వేగంగా, పారదర్శకంగా సాగుతుందని ఎన్నికల సంఘం ధీమా వ్యక్తం చేస్తోంది.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణలో అక్రిడిటేషన్ల జారీ

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:

రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్ట్‌కు అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచన మేరకు పాత్రికేయులకు ఆరోగ్యంతోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గురువారం నాడు సమాచార శాఖ ఆధ్వర్యాన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంత్రిగారు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులను ఇంతవరకు పొడిగించామని, దేశంలో, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరించాలన్న ఆలోచన మేరకు పరిశీలన సాగిందని అందువల్లే ఈ కార్డుల జారీలో ఆలస్యం చోటుచేసుకుందన్నారు. గత ప్రభుత్వం 32,500 మందికి అక్రిడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా 23,352 కే పరిమితం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు సుమారు 46 వేల మందికి పైగా అక్రిడిటేషన్లు ఇచ్చేలా మార్పులు చేసిందని తెలిపారు. ఇప్పటికే సుమారు 2800 వరకు కార్డులను ఆమోదించడం జరిగిందని వివరించారు. జర్నలిస్టుల సూచనల మేరకు జీవోలలో మార్పులు చేర్పులు చేశామని, అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరులో వెనకడుగు ప్రసక్తే లేదని అన్నారు. మే 1వ తేదీన అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ ప్రక్రియలో మే 10 వతేదీని ఒక కటాఫ్ డేట్‌గా పెట్టుకొని దరఖాస్తులు చేసుకోవాలని, ఆ తేదీలోగా వచ్చే దరఖాస్తులను ఆమోదించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్ల సంఖ్య తేలితే జర్నలిస్టులకు ఆరోగ్యం ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చునని అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఈ దిశగా పలు సూచనలు చేశారని వెల్లడించారు. అంతేగాక జర్నలిస్టులు వివిధ సంస్థలలో ఉద్యోగాలు మారినప్పటికీ అక్రిడిటేషన్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుందని ఈ విషయంలో ఎటువంటి సందేహాలు వద్దని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని త్వరలో పాత్రికేయ సంఘాలతో భేటీ అవుతామని తెలిపారు. ఏప్రిల్ 30తో కొంతమంది జర్నలిస్టుల బస్సుపాస్‌ల గడువు ముగుస్తున్నందున మరో 15 రోజుల పాటు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విడుదలైన ఎగ్జిట్ పోల్స్

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 30:

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి ఓటింగ్ ముగిసిన వేళ పలు సంస్థలు తమ సర్వేలు విడుదల చేశాయి. వీటిలో పీపుల్స్ పల్స్, ఎస్ ఎ ఎస్ గ్రూప్, చాణక్య స్ట్రాటజీస్...ఇలా పలు సంస్థలు తమ సర్వేలు విడుదల చేశాయి. వీటిలో అత్యధిక స్థానాలు(294) ఉన్న బెంగాల్ లో మళ్లీ టీఎంసీ అధికారంలోకి వస్తుందని చెప్పినా బీజేపి గట్టి పోటి ఇస్తుందని తమ సర్వే లో పేర్కొంది. తమిళనాడు(234) స్థానాలకు గానూ అన్ని సంస్థలు మళ్లీ డీఎంకె కూటమికే పట్టం కడతారని అంచనా వేశాయి. ఇంక తమిళనాడు లో సినీహీరో విజయ్ కొత్త పార్టీ టీవికే ఎక్కడా ప్రభావం చూపలేకపోయిందని చెప్పాయి. ఒక్క సర్వే 'యాక్సిస్ మై ఇండియా' మాత్రం విజయ్ కొత్త పార్టీకి 98120 సీట్లు వస్తాయని అంచనా వేసింది. కేరళం(140) సీట్లుకు దాదాపు అన్ని సంస్థలు ఈ సారి అధికారం మారబోతోందని చెప్పాయి. ఇంక అస్సాం(126), పుదుచ్చెరి(30) సీట్లకు ఎన్డీఎ కే సర్వే సంస్థలు జై కొట్టాయి.

**ఎగ్జిట్ పోల్స్ ఎగ్జాట్ పోల్స్ అవుతాయా?:**

దేశంలో జరిగే ఎగ్జిట్ పోల్స్ 100శాతం నిజమౌతాయని ఎవరూ అనుకోరు. కానీ సంస్థ క్రెడిబిలిటీ బట్టీ, వారు ఉపయోగించే గ్రౌండ్ లెవల్ టూల్స్ బట్టి ఇది ఆధారపడి ఉంటుంది. మనం ఎగ్జిట్ పోల్స్ సంస్థలు ముందు ఇచ్చిన సర్వేలు చూస్తే ఒక అంచనాకి రావచ్చు. అలా నిన్న విడుదలైన ఎగ్జిట్ పోల్స్ లో ఒక రెండు సంస్థలు ఇంతకుముందు వాళ్లు ఇచ్చిన ఏపి, తెలంగాణ ఫైనల్ రిజల్ట్ తో పోల్చి చూద్దాం.

**పీపుల్స్ పల్స్, చాణక్య స్ట్రాటజీస్ :**

పీపుల్స్ పల్స్ ఢిల్లీ అసెంబ్లీ ఎలక్షన్స్ 2025లో ఆప్ ఓడిపోతుందని, బీజేపి 51 నుంచి 60 సీట్లతో అధికారంలో కి వస్తుందని ఎగ్జిట్ పోల్స్ లో చెప్పింది. అలాగే 2024 ఏపిలో జరిగిన ఎన్నికలలో కూడా కూటమి 135 సీట్లతో అధికారంలోకి వస్తుందని సర్వే రిపోర్ట్ లో పేర్కొంది. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎలక్షన్స్ లో కాంగ్రెస్ 62 నుంచి 72 సీట్లతో అధికారంలోకి వస్తుందని అంచనా వేసింది. ఈ సర్వే చెప్పినట్లుగానే ఆయా పార్టీలు అధికారంలోకి వచ్చాయి.

చాణక్య స్ట్రాటజీస్ సంస్థ 2024 లో ఏపిలో జరిగిన అసెంబ్లీ ఎలక్షన్స్ లో ఈ సంస్థ కూటమి 114 నుంచి 125 సీట్లతో అధికారంలోకి వస్తుందని అంచనా వేసింది. అలాగే 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎలక్షన్స్ లో కాంగ్రెస్ 67 నుంచి 78 సీట్లతో అధికారంలోకి వస్తుందని, బీఆర్ఎస్ కి 22 నుంచి 31 సీట్లకి పరిమితమౌతుందని సర్వేలో పేర్కొంది. ఈ సర్వేలో కూడా చెప్పినట్టు ఆయా పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఈసారి బెంగాల్ లో సర్వే చేసినప్పుడు తన టీంకి ఓటర్లు తమ అభిప్రాయం స్వేచ్ఛగా చెప్పలేదని యాక్సిస్ మై ఇండియా సంస్థ ప్రతినిధి ప్రదీప్ గుప్తా తెలిపారు. ఇంతకు ముందు సర్వే చేసినప్పుడు ఈ భయాన్ని తన టీం చూడలేదని ఆయన చెప్పారు. ఈసారి తమ సర్వేలో దాదాపు 60% మంది ఓటర్లు తమ నిర్ణయాలను చెప్పడానికి నిరాకరించారని అన్నారు. బెంగాల్ లో రెండు ఫేజ్ లు కలిపి 92% ఓటింగ్ నమోదయ్యింది. మమతా బెనర్జీ పోటీ చేసిన భబానిపూర్ లో 86.63% పోలింగ్ జరిగింది. ఈ స్థానానికి ప్రత్యర్థిగా పోటి చేస్తున్న సువేందు అదికారి ఎలాగైనా మమతను ఓడించాలని ప్రయత్నాలు చేశారు. ఈ స్థానంలో మమతను ఓడిస్తే ఇక బెంగాల్ లో పాగా వేయొచ్చని బీజేపి భావిస్తోంది. బీజేపి బెంగాల్ లో ఓడిపోతే నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని టీఎంసి రాజ్యసభ ఎంపి దీరెక్ సవాల్ విసిరారు. తమిళనాడులో విజయ్ పెద్దగా ప్రభావం చూపదని, కాబట్టి పెద్దగా ఓట్లు చీలే అవకాశం లేదని సర్వే సంస్థలు అభిప్రాయపడ్డాయి. ఈ మధ్య మహిళా బిల్లుకి, ఢిలిమిటేషన్ కి కేంద్రం లింక్ పెట్టడం, దీనిని పూర్తిగా స్టాలిన్ వ్యతిరేకించడంతో ఇది కలిసి వచ్చే అంశంగా మారొచ్చు. కేరళ లో వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ ఈ సారి ప్రభుత్వ వ్యతిరేక రావొచ్చని అంచనాతో ఇక్కడ యూడిఎఫ్ అధికారంలోకి రావొచ్చని అంచనా. అస్సాం, పుదుచ్చెరి లో బీజేపి నే మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. తమిళనాడులో 84.29% , కేరళ లో 78.27% , అస్సాంలో 85.64% , పుదుచ్చెరిలో 91.23% పోలింగ్ నమోదైంది.

# మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 12 మంది కూలీల దుర్మరణం

మధ్యప్రదేశ్ వెలుతురు ఏప్రిల్ 30:

మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీలను తీసుకెళుతున్న పికప్ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడి, ఎదురుగా వస్తున్న ఎస్‌యూవీని ఢీకొట్టడంతో 12 మంది మృతి చెందారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ధార్ జిల్లాలోని బగ్గద్ నుంచి ఇంటికి వస్తున్న 35 మంది కూలీలను తీసుకెళుతున్న వ్యాన్‌లో జరిగింది. చిక్లియా క్రాసింగ్ దగ్గర వ్యాన్ డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం బోల్తా పడి, వ్యతిరేక దిశ నుంచి వస్తున్న ఎస్‌యూవీని ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థలంలోనే 12 మంది ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన 20 మందిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన తెలియగానే పోలీసులు, రెస్క్యూ టీమ్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడినవారి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో వారికి మెరుగైన వైద్య సహాయం అందించడానికి ఏర్పాట్లు చేశారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వ్యాన్ అధికంగా ఓవర్‌లోడ్‌గా ఉండటం, డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వంటి కారణాలు ప్రాథమికంగా చెబుతున్నారు. ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి దర్యాప్తు కొనసాగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ దుర్ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని సంతాపం తెలిపారు. చనిపోయిన ప్రతి ఒక్కరి కుటుంబానికి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా, గాయపడినవారికి రూ.50 వేలు పరిహారం ప్రకటించారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం (పీఎంఓ) ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. రోడ్డు భద్రత, వాహనాల అధిక లోడింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# విమర్శలు కాదు...ఫలితాలే ప్రమాణం

- **గురుకులాలు... పేద విద్యార్థి భవిష్యత్తును మార్చే శక్తి కేంద్రాలు**
- **విజయ దుందుభి మోగించిన సాంఘిక సంక్షేమ గురుకులాలు**
- **99.12% ఉత్తీర్ణతతో కార్పొరేట్ సంస్థలను అధిగమించి ఫలితాలు**
- **ఇవే మా ప్రభుత్వ పనితీరుకు ప్రత్యక్ష సాక్ష్యం**
- **వ్యవస్థ మారితే ఫలితాలు ఎలా ఉంటాయో నిరూపించిన గురుకులాలు**
- **సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యకు పెద్ద పీట**
- **ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసిన మా విద్యార్థులు సాధించిన విజయలే మాకు గీటు రాయి**
- **40 ఏళ్ల చరిత్రలో 99.22 శాతం పాస్ పర్సంటేజ్ నమోదు కావడం ఇదే తొలిసారి**
- **సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**హైదరాబాద్ (వెలుతురు) ఏప్రిల్ 29:** రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు 2026 పదవ తరగతి ఫలితాల్లో 99.12 శాతం ఉత్తీర్ణత సాధించి చరిత్ర సృష్టించాయి. మొత్తం 17,071 మంది పరీక్షలకు హాజరుకాగా 16,921 మంది ఉత్తీర్ణులయ్యారని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఈ ఫలితాలు సాధించడం గురుకులాల విద్యా ప్రమాణాలను మరింత బలపరిచిందన్నారు. గురువారం డి ఎస్ ఎస్ భవన్ లోని TGSWREIS లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఇది కేవలం ఫలితం కాదని, వ్యవస్థాత్మక మార్పులు, నిరంతర పర్యవేక్షణ, ప్రభుత్వ సంకల్పం, వ్యూహాత్మక సంస్కరణల సమిష్టి ఫలితమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకులాలను నూతన దిశగా తీసుకెళ్తున్నామని వెల్లడించారు.

ఫలితాల్లో రికార్డు

235 ఇనిస్టిట్యూషన్లలో 163 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించాయి.

9 జిల్లాల్లో అన్ని గురుకులాల్లో 100% ఫలితాలు సాధించాయి.

ఇంటర్ II సంవత్సరంలో 88.22% ఉత్తీర్ణత, 41 కాలేజీల్లో 100%

ఇంటర్ I సంవత్సరంలో 77.79% ఉత్తీర్ణత, 12 కాలేజీల్లో 100%

JEE మెయిన్స్‌లో 441 మంది అర్హత, 35 మంది 90 పర్సెంటైల్ పైగా

IIT, JEE, NEETలో కూడా మెరుగైన ఫలితాలు

స్టూడెంట్ సెంట్రిక్' విధానమే విజయ రహస్యమన్న మంత్రి ఇందుకోసం ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ

రోజువారీ బోధనతో పాటు ప్రత్యేక స్టడీ అవర్స్ సాయంత్రం డౌట్ క్లారిఫికేషన్ సెషన్లు వీక్లీ, మంత్లీ అసెస్‌మెంట్లు

సిలబస్ పూర్తయ్యాక ప్రత్యేక రివిజన్ ఫెయిల్యూర్ రిస్క్ ఉన్న విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ "ఒక్క విద్యార్థి కూడా వెనుకబడకూడదు" అనే లక్ష్యంతో ట్రాకింగ్ వ్యవస్థ అమలు చేసినట్లు మంత్రి తెలిపారు.



అకడమిక్ సంస్కరణలు డేటా ఆధారిత విధానం "బేసిక్ టు అడ్వాన్స్‌డ్" లెర్నింగ్ మోడల్ సబ్జెక్ట్ వారీ మైక్రో ప్లానింగ్ స్టూడెంట్ & టీచర్ వైజ్ అనాలిసిస్ పర్ఫార్మెన్స్ డ్యాష్‌బోర్డ్స్ వెంటనే కరెక్టివ్ యాక్షన్ ఉపాధ్యాయుల అంకితభావం ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లలుగా చూసుకుంటూ 24 గంటలు అందుబాటులో ఉండి బోధన అందించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని మంత్రి ప్రశంసించారు. టీచర్లకు ట్రైనింగ్స్, వర్క్‌షాప్స్, ఫలితాల ఆధారంగా రివ్యూ సిస్టమ్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పోషకాహారం - ఫలితాల పునాది

విద్యార్థుల ఆరోగ్యం, మానసిక స్థైర్యం విద్యా ఫలితాల్లో కీలకమని గుర్తించి మెస్ ఛార్జీలను పెంచి ప్రోటీన్ రిచ్ డైట్ అందిస్తున్నామని తెలిపారు. హాజరు పెరగడం, ఆరోగ్య సమస్యలు తగ్గడం ఫలితాల్లో తిబింబించిందన్నారు.

కాస్మోటిక్ ఛార్జీలు - గౌరవప్రద జీవనం

విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మవిశ్వాసం పెంచేందుకు కాస్మోటిక్ ఛార్జీలు పెంచినట్లు చెప్పారు.

మౌలిక సదుపాయాల్లో మార్పులు, ఆధునిక హాస్టల్ సదుపాయాలు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్స్, లైబ్రరీలు, క్రీడా వసతులు గురుకులాలను "మోడల్ ఎడ్యుకేషన్ క్యాంపసెస్"గా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

మానసిక స్థైర్యం - ప్రత్యేక శ్రద్ధ

ఎగ్జామ్ ముందు స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ కౌన్సెలింగ్, మోటివేషనల్ సెషన్లు నిర్వహించడం జరిగింది. హాస్టల్ వాతావరణాన్ని కుటుంబ వాతావరణంలా మార్చడం ద్వారా విద్యార్థుల్లో నమ్మకం పెరిగి, మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని అధికారులు తెలిపారు.

పరిపాలనలో పారదర్శకత

డైట్ మరియు కాస్మోటిక్ బిల్లులను మార్చి 31 నాటికి పూర్తిగా క్లియర్ చేయడం జరిగింది. భవనాల అద్దెల చెల్లింపులు కూడా పూర్తి చేయడంతో పాటు ప్రతి నెల మొదటి వారంలోనే బిల్లులు క్లియర్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌పై కూడా ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

తల్లిదండ్రుల విశ్వాసం పెరుగుతోంది

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గురుకులాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళిత, గిరిజన విద్యార్థుల విద్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, విద్య ద్వారానే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. కాస్మోటిక్ చార్జీలను పెంచడం వంటి చర్యలు కూడా ఈ లక్ష్యానికి అనుగుణంగా తీసుకున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాల విమర్శలు ఉన్నప్పటికీ, గురుకులాలపై తల్లిదండ్రుల విశ్వాసం మరింత పెరిగిందని చెప్పారు. ఈ ఏడాది అడ్మిషన్లు రికార్డు స్థాయిలో పెరగడం ఇందుకు నిదర్శనమని వివరించారు.

గతంతో పోలిస్తే గణనీయ పురోగతి

గత సంవత్సరాలతో పోలిస్తే ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. ఇది ప్రభుత్వ విధానాల విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు.

భవిష్యత్ లక్ష్యం

"గురుకులాలను దేశంలోనే ఉత్తమ విద్యా నమూనాగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. పేదల పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందిస్తూ, వారిని గ్లోబల్ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం" అని మంత్రి స్పష్టం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఘనంగా సన్మానించారు.

ఎస్సీ వసతి గృహాల ఫలితాలు

ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతి గృహాల్లో ఉత్తీర్ణత శాతం వివరాలను మంత్రి వెల్లడించారు. 63 ప్రీమెట్రిక్ వసతి గృహాల నుంచి 8060 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా, 7666 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 95.11%గా నమోదు అయింది. ఇది రాష్ట్ర సగటు 95.15%తో పోలిస్తే కేవలం 0.04% తక్కువ మాత్రమేనని మంత్రి తెలిపారు.

100% ఉత్తీర్ణత సాధించిన వసతి గృహాలు 369 ఉండగా, జిల్లాల వారీగా ములుగు జిల్లా 100% ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. 91% నుండి 100% మార్కుల మధ్య 195 మంది విద్యార్థులు, 81% నుండి 90% మధ్య 1416 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు.

టాప్ మార్కులు


ఎస్సీ వసతి గృహాల్లో అత్యధికంగా 581 మార్కులు సంగారెడ్డి జిల్లాకు చెందిన రామావత్ మల్లేశ్వరి సాధించారు. రెండో స్థానంలో ముగ్గురు విద్యార్థులు 579 మార్కులు సాధించినట్లు మంత్రి తెలిపారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కూడా విశేష ఫలితాలు నమోదయ్యాయి. మొత్తం పాఠశాలల్లో 100% రిజల్ట్స్ సాధించిన పాఠశాలల సంఖ్య గణనీయంగా ఉందని మంత్రి వెల్లడించారు.

సమావేశం వివరాలు

ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్య సాచి ఘోష్, గిరిజన శాఖ డైరెక్టర్ మరియు ఇంచార్జ్ కమిషనర్ సంతోష్, మంత్రి ఓఎస్డీ వై.జె. విజయ్ కుమార్, TGSWREIS జాయింట్ సెక్రటరీ బానోతు గీత, అడిషనల్ సెక్రటరీ (అకాడమిక్) సక్కు నాయక్, ఆశ్రమ పాఠశాల డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జోనల్ అధికారులు, ఆర్‌సిఓలు, వివిధ పాఠశాలలు మరియు కళాశాలల ప్రిన్సిపల్స్, SSC, ఇంటర్, JEE మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు.







Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com